గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# మే 2014
# కథలు




ముందు మాట :

ఈ కథ రాయడానికి కారణం నేను అనుభవించినది... పిల్లలతో వచ్చిన భక్తులు పడ్డ యాతన కళ్ళతో చూసినది. భక్తులతో ప్రవర్తించిన తీరు చూసి బాధపడుతూ ఇది ఇలాగే జరిగితే భవిష్యత్తు లో దేవుడి మీద భక్తి పోతుందేమోనని బాధతో రాసిన కథ. కుబేరుడు - శ్రీనివాసుల సంవాదం కథకి సపోర్టు గా తీసుకున్నది మాత్రమే. అంతే గాని దేవుడిని కించ పరచాలని గాని, ఎవరినీ ఉద్దేశించి గాని రాసినది కాదని దీనివల్ల ఎవరికైనా గాని, భక్తులకు మనోభావాలు దెబ్బతింటే మనస్ఫూర్తిగా మన్నించమని కోరుతూ..

వైకుంఠం లో శ్రీనివాసుడు దిగాలుగా వున్నాడు.

లక్ష్మి దేవి అక్కౌంటు బాలన్స్ నిల్ అయ్యే పరిస్థితి వచ్చిందని చాలా చిరాగ్గా వుంది.

ఇంతలో కుబేరుడు 'శ్రీనివాసా.. శ్రీనివాసా…' అంటూ వచ్చాడు.

శ్రీనివాసుడు కుబేరుడుని చూసి 'రండి..స్వామీ.. చాలా కాలానికి వచ్చారు. రండి' అన్నాడు.

'నేను మీ మర్యాదల కోసం రాలేదు. ఇంత కాలం సమయానికి వడ్డీ కడుతున్నారని నేను వచ్చే అవసరం లేకపోయింది. ఈ మధ్య మీరు వడ్డీ కట్టడం మానేశారు. అందుకే నేను రావసలి వచ్చింది.

'స్వామి భూలోకంలో పరిస్థితి మీకు తెలుసుగా. భక్తులు అందరు తిరుపతి రావడం మానేశారు. దాంతో హుండీ లో దమ్మిడీ పడటం లేదు. ఆదాయం తగ్గి మీకు వడ్డీ కట్టడం ఆలస్యం అయింది.' అన్నాడు శ్రీనివాసుడు

'అదంతా నాకనవసరం. ఇప్పుడు వడ్డీ కట్ట లేని వారు, రేపు అసలు ఏం కడతారు. మీకు వారం రోజులు టైం ఇస్తున్నా.. అసలు, వడ్డీ రెండు వెంటనే కట్టే ఏర్పాటు చెయ్యండి' అన్నాడు కుబేరుడు.

'ఇక్కడ వడ్డీ కట్టడానికే నడ్డి విరుగుతోంది. అసలు కూడానా.. అదీ వారం లోనా… కష్టం.' అన్నాడు

'సరే.. మీరు ఏడు కొండల వారు కనక ఏడు వారాలు టైం ఇస్తున్నా.. ఈ లోగా సగమయినా ఏర్పాటు చెయ్యండి' అంటూ వెళ్లి పోయాడు. కుబేరుడు

'స్వామీ అసలేం జరిగింది' అంటూ అడిగింది లక్ష్మీ దేవి.

'శ్రీనివాసుడు నేను చెప్పడం ఎందుకు నువ్వే చూడు' అంటూ కిందకి చూపించాడు.

అది 2020.

తిరుపతి కొండ మీద ఒక్క భక్తుడు లేడు. ఖాళీ గా వుంది.

ఆ వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకోడానికి ఒక్కడూ రావడం లేదు. కొండమీదకి కిందకి బస్సులు తిరగడం లేదు.

తిరుపతి దేవస్థానంలో కొంతమందిని ఉద్యోగాలనుంచి తీసేశారు. మిగిలిన ఉద్యోగులకు జీతాలు లేవు. పూజారులు పూజలు చేస్తున్నారు కాబట్టి ఏదో కొద్దో, గొప్పో ఇస్తున్నారు.

లడ్డూల తయారీ, ఇతర ప్రసాదాల తయారీ ఆగిపోయింది. పోటు గదిలో తయారు చేస్తున్న ప్రసాదంలో వాటాలు లేవు. పని లేని పూజారులకి, పంతుళ్ళకి జీతాలు లేవు.

టి.టి.డి. కాలేజీలు, కాటేజీలు, హాస్పటల్స్, ఒకటేమిటి దేవస్థానం నిర్వహిస్తున్న అన్ని సంస్థలు మూతపడే పరిస్థితి వచ్చేసింది. టి.టి.డి వ్యవస్థ అతలా కుతలమై పోతూంది. ఆదాయం లేదు.

దీనికంతటికి కారణం ఒక కధ.

నిజానికి అది కధ కాదు. ఒక భక్తుని వ్యధ. కడుపు మండి కలానికి పదును పెట్టి తన అనుభవాన్ని కధగా రాసి అందరి కళ్ళు తెరిపించిన వెంకట రమణ కధ.

అసలేం జరిగిందంటే .... కధ లోకి వెళదాం.

వెంకట రమణ గవర్నమెంటు ఆఫీసులో సీనియర్ క్లర్క్. ఆరునెలల క్రితమే వెంకటేశానికి తండ్రి అయ్యాడు. పుట్టు వెంట్రుకలు తీయించడానికి తిరుపతి వెళ్లాలని ప్రోగ్రాం ఫిక్స్ చేసి రాను..పోనూ రిజర్వేషన్ కూడా చేసాడు.

తిరపతి బయలుదేరే రోజు వచ్చింది.

వెంకట రమణ గారు.. వెంకట రమణగారు.' అంటూ కాశీపతి పంతులు వచ్చాడు.

'రండి పంతులు గారు. మీ కోసమే చూస్తున్నాం.' అన్నాడు రమణ.

'ఏమిటి సంగతి అర్జెంటు గా రమ్మన్నారు' అడిగాడు కాశీపతి

'ఇవాళ సాయంత్రం మా అబ్బాయి వెంకటేశానికి పుట్టు వెంట్రుకలు తీయించడానికి      మేం తిరుపతికి వెళ్తున్నాం. వెంకటేశ్వర స్వామి దీపారాధన చేసుకుని బయలు దేరాలనుకుంటున్నాం. కాస్త దీపారాధన చేయిస్తారని కబురు పెట్టాను.' అన్నాడు రమణ.

'ఓ దానికేం భాగ్యం.. అలాగే కానివ్వండి. అంతా సిద్ధం చేసుకున్నారా; అడిగాడు కాశీపతి'

'ఆ. అన్నీ సిద్ధంగానే వున్నాయి. మీదే ఆలస్యం.. అలివేలు.. పంతులు గారు వచ్చారు. అన్నీ సిద్ధం చెయ్యి' అంటూ చెప్పాడు వెంకట రమణ.

కాశీపతి      ఇద్దరిలో దీపారాధన చేయించాడు. ఇద్దరూ నిష్టగా, భక్తిగా పూజ చేసుకున్నారు. చుట్టు పక్కల వాళ్ళని పిలిచి భోజనాలు పెట్టాడు. అందరూ తృప్తిగా భోజనాలు చేసి వెళ్ళారు.

పంతులు కూడా భోజనం చేసి 'ఎన్నింటికి రైలు' అడిగాడు కాశీపతి.

'ఆరు గంటలకి. తిరుపతి ఎక్స్ ప్రెస్' అంటూ దక్షిణ ఇచ్చి పంపించాడు.

'ఏవండీ ఓ పది లడ్డూలు ఎక్కువ తీసుకుని చుట్టు పక్కల వాళ్ళకి ప్రసాదం పంచి పెడదాం. అలా చేస్తే పుణ్యం కూడానట' అంటూ ఆనందంగా చెప్పింది అలివేలు.

‘అలా అయితే పదేంటి పాతిక తీసుకుందాం’ అన్నాడు హుషారుగా వెంకటరమణ.

ఇద్దరూ ప్రయాణానికి కావలిసినవి సర్దుకోవడం మొదలు పెట్టారు.

సాయంత్రం అయిదు గంటలయింది.

‘ఇంకా ఎంత సేపు తెమలడం. నువ్వు తెమిలే సరికి రైలు కాస్తా వెళ్ళి పోయేట్టు వుంది.

‘పిల్లల తో ప్రయాణం అంటే మాటలా.. ఎన్ని సర్దు కోవాలి.. అయిపోయింది. పదండి. అంది అలివేలు.

‘నేను ఆటో పిలుచుకువస్తాను. రడీ గా వుండు’ అంటూ వెళ్ళాడు రమణ

అలివేలు సామానులన్నీ బయట పెట్టి తలుపు తాళం పెట్టి పిల్లాడ్ని చంకన వేసుకుంది.

ఇంతలో రమణ ఆటో తో వచ్చాడు.

ముగ్గురూ ఎక్కి సికింద్రాబాద్ స్టేషన్ కి చేరుకున్నారు. ఆటోదిగి సామానులన్నీ దింపి లెక్క పెట్టుకుని మీటరు చూసాడు నూట అరవై అయింది. జేబులోంచి పర్సు తీసి రెండు వందల నోట్లు తీసి ఇచ్చాడు.

ఆటో డ్రైవర్ తీసుకుని ‘చిల్లర లేదు’ అన్నాడు

‘చిల్లర లేదు అంటే ఎలా.. చూడు’ అన్నాడు.

'లేదు సార్.. వుంటే ఇవ్వనా' అన్నాడు

స్టేషన్ లోంచి ' సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్ళవలసిన తిరుపతి సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ మరి కొద్ది నిముషములలో ఒకటవ నంబరు ఫ్లాట్ ఫాం మీద బయలుదేరుటకు సిద్ధముగా వున్నది'. అంటూ అనౌన్స్ మెంటు వినిపించింది

'ఏవండీ రైలు రడీగా ఉందిట' అంది అలివేలు కంగారుగా

'త్వరగా చిల్లర ఇవ్వవయ్యా. ఆవతల రైలు టయిమయింది.' అన్నాడు చిరాగ్గా రమణ

'చిల్లర లేదు. ఏం చెయ్యమంటారు.' అన్నాడు ఆటో డ్రైవర్.

'నన్నేం చెయ్యమంటావు' అన్నాడు రమణ

'చిల్లర తెచ్చుకోవాలి.' అంటూ రెండు వందలు తీసుకొని 'వుండండి ట్రై చేస్తాను' అంటూ వెళ్ళాడు ఆటో డ్రైవర్.

మళ్ళీ అనౌన్స్ మెంటు వినిపించింది.

'ఆటో డ్రైవర్ వచ్చేలా లేదు' అంది అలివేలు

'ఎక్కడికి వెళ్తాడు. ఆటో ఇక్కడే వుంది గా' అన్నాడు రమణ

'అంత వరకు రైలు వుండదు. పదండి' అంది అలివేలు ఓ చేత్తో సంచి తీసుకుంటూ

రమణ ఆటో డ్రైవర్ కోసం చూసాడు. ఎక్కడా వచ్చేట్టు కనిపించలేదు.

స్టేషన్ లోంచి 'సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్ళవలసిన తిరుపతి సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ ఒకటవ నంబరు ప్లాట్ ఫాం మీద బయలుదేరుటకు సిద్ధముగా వున్నది'. అంటూ ఇంకోసారి అనౌన్సు మెంట్ వినిపించింది.

'ఎక్కడికి పోయాడో..' అంటూ సామానులు తీసుకుని రమణ వెళ్లి పోయాడు.

రమణ లోపలికి వెళ్ళగానే పక్కనే కారు వెనకాల నిలబడి వున్న ఆటో డ్రైవర్ వచ్చి ఆటో తీసుకుని వెళ్లి పోయాడు.

అది చూసి రమణ షాకయ్యాడు. 'చిల్లర తెచ్చుకోని పాపానికి నలభై క్షవరం' అనుకున్నాడు.

గబా గబా సామానులతో రైలు ఎక్కాడు. వెంటనే రైలు బయలు దేరింది.

తిరుపతి లో దిగి అక్కడి నుంచి బస్సు ఎక్కి తిరుమల చేరారు వెంకట రమణ. అలివేలు.

తిరుమలలో రూమ్ తీసుకుని ఫ్రెష్ అయ్యి అన్నీ సర్దుకుని దర్శనానికి బయలు దేరారు.

వెంకటేశానికి ఆరు నెలలు. తెల్లగా బొద్దుగా అందంగా ఉంటాడు. జుట్టు కూడా ఎక్కువేమో వంకీలు తిరిగి వుంది. టైం తొమ్మిదయింది.

వెంకటేశం పుట్టు వెంట్రుకలు తీయించడానికి కళ్యాణ కట్ట కి బయలు దేరారు.

‘ఎక్కడండీ కళ్యాణ కట్ట దూరమా’ అడిగింది అలివేలు.

‘ఇది వరకు ఇక్కడే వుండేది. ఇప్పుడు ఎక్కడికి మార్చారో’ అంటూ చుట్టూ చూసాడు. ఎదురుగా కళ్యాణ కట్టకి దారి అని బోర్డు కనిపించింది.

‘అదిగో బోర్డు.. అలా వెళ్ళాలి. రా’ అంటూ తీసుకు వెళ్ళాడు. కొంత దూరం వెళ్ళాక ఇంకో బోర్డు కనిపించింది. అలా ఓ పది బోర్డులు దాటుకుంటూ వెళ్ళగా ఓ పెద్ద బిల్డింగు కనిపించింది.

‘హమ్మయ్య.. ఇదే కళ్యాణ కట్ట. పద.’ అంటూ లోపలికి వెళ్ళబోయారు.

అక్కడే వున్న గార్డు ‘ఎయి. ఇటెక్కడికి, ఇలా లోపలికి వెళ్ళకూడదు. బయట లైను వుంది దాంట్లో వెళ్ళండి.. పోండి.’.. అంటూ ఎంతో అ..గౌరంగా, అ..మర్యాదగా చెప్పాడు. ఆ లైను ఎక్కడ వుందా అంటూ వెతుక్కుంటూ అలా తిరిగి తిరిగి మొత్తానికి లైనులో నిలబడ్డారు.

‘హమ్మయ్య లైనులోకి వచ్చేసాం’ అనుకుని టైం చూసుకున్నాడు రమణ, పదిన్నర అయింది.

ఒక నిముషం నిలబడి వెనక్కి చూసే సరిని వెంకట రమణ వెనకాల ఓ వంద మంది నిలబడ్డారు. ‘అమ్మో ఒక నిముషం లేటయి వుంటే అంతమంది వెనకాల ఉండేవాడిని’ అనుకుంటూ వెంకట రమణ ఆశ్చర్య పోయాడు.

ఇంతలో వెంకటేశంకి ఆకలి వేసినట్టుంది. ఏడవడం మొదలు పెట్టాడు.

‘ఏవండి వీడిని కాసేపు ఎత్తుకొండి. ఆకలి వేస్తున్నట్టుంది పాలు కలుపుతాను’ అంటూ వెంకటేశాన్ని రమణకి ఇచ్చింది. రమణ ఎత్తుకున్నాడు.

ఫ్లాస్కు లోంచి పాలు తీసి గ్లాసులో పోసి పంచదార కలిపి సీసాలో పోసింది. ఫ్లాస్క్ వెంకటరమణ కి ఇచ్చి పిల్లాడిని తీసుకుని పాలు

పట్టించింది. వెంకటేశానికి కడుపు నిండటంతో ఏడుపు మాని ఆట మొదలు పెట్టాడు.

ఇంతలో “గోవిందా....గోవింద..' కొంత మంది భక్తులు అరిచారు. లైను కొద్దిగా ముందుకు కదిలింది.

వెంకట రమణ 'లైన్ బాగానే కదిలింది' అనుకున్నాడు.

'పుట్టు వెంట్రుకలా?ఎక్కడి నుంచి వస్తున్నారు'. అంటూ అలివేలుని అడిగింది ముందుగా వున్నావిడ.

'అవునండి. హైదరాబాద్ నుంచి      మీరెక్కడినుంచి' అడిగింది అలివేలు.

'మేం వైజాగ్ నుంచి' అని చెప్పింది ఆవిడ. అలా కాసేపు కబుర్లతో గడిచింది.

లైను కదలడం లేదు.

'ఏమయింది. లైను కదలడం లేదు.' అడిగాడు పక్క వాడిని.

'మీకెంత తెలుసో నాకు అంతే తెలుసు' అన్నాడు ఆ వ్యక్తి

వెంకట రమణ ఫీలయ్యాడు.

ఇంతలో ఓ గార్డు అటు వెళుతున్నాడు.

'హలో' అంటూ పిలిచాడు వెంకట రమణ

ఆ గార్డు వచ్చాడు

'ఇంకా ఎంత సేపు పడుతుంది' అడిగాడు.

'ఎంత సేపయింది మీరు నిలబడి' అడిగాడు గార్డు

'ఓ అరగంట' అయింది

'లోపల ఆరు గంటల నుంచి నిలబడ్డ వాళ్ళు వున్నారు.' అన్నాడు గార్డు

ఆశ్చర్య పోయాడు

'ఆరు గంటల నుంచా'

'అవును. లోపల పది కంపార్ట్మెంటులు వున్నాయి. అవి వదిలిన తర్వాత మిమ్మల్ని వదులు తారు.' అన్నాడు గార్డు.

'పదా..ఎంత సేపు పడుతుందో' అడిగాడు రమణ

'ఓ   ఏడు ఎనిమిది తొమ్మిది పది గంటలు పడుతుంది.' అంటూ వెళ్లి పోయాడు.

వెంకట రమణ షాక్ అయ్యాడు.

‘తొమ్మిది పది గంటలా.’.     అంటూ టైం చూసు కుంటూ వున్నాడు. మూడు అరగంటలు గడిచాయి. లైను మూడు అంగుళాలు కూడా కదలలేదు.

‘బయటికి పోదామా’ అంటూ వెనక్కి చూసాడు.

ఎటూ దారి లేదు. ఏం చెయ్యాలో తెలీక అలాగే నిలబడ్డారు.

ఇంతలో మళ్ళీ కొంత మంది ‘ గోవిందా … గోవింద’ అంటూ అరిచారు.

లైను ముందుకు కదిలింది.

అక్కడ ఎమర్జన్సీ గేటుని చూసాడు. అక్కడ వున్న గార్డుని పిలిచి ఇద్దరూ బయటికి వచ్చారు. అప్పటికే     రెండయింది.

‘అమ్మో … ఇదేమిటండీ ఇంతమంది వున్నారు. పది గంటలా.. ఇప్పుడు ఎలాగా’ అడిగింది అలివేలు.

‘నేను అదే ఆలోచిస్తున్నా’ అంటూ చుట్టూ చూసాడు.

అక్కడే వున్న వరాహ స్వామి కాటేజ్ దగ్గర కూడా తల నీలాలు తీస్తారని బోర్డు కనిపించే సరికి ‘కొండ మీద ఎక్కడయితేనే అక్కడే తీయిద్దాం పద’     అంటూ

వెళ్ళారు. అప్పటికే రెండున్నర అయింది. అక్కడే వున్న కాంటీన్ లో కాస్త టిఫిన్ తిని వెంకటేశానికి     సిరిలాక్ తినిపించి వరాహ స్వామి కాటేజ్ కి వెళ్ళారు. అక్కడ కూడా చాంతాడు అంత లైను వుంది. మొత్తానికి వెంకటేశానికి తల నీలాలు తీయించి, వెంకట రమణ గుండు చేయించుకోడానికి, అలివేలు మూడు కత్తెరలు ఇవ్వడానికి ఓ మూడు గంటలు పట్టింది. నీలాల కార్యక్రమం పూర్తయ్యే సరికి నింగిలో సూర్యుడు కిందకి దిగిపోయాడు. ఇంక ఇప్పుడు పిల్లవాడితో రాత్రి దర్శనం కష్టమని కాటేజ్ కి బయలుదేరారు.

తెల్లవారు ఝామున నాలుగు గంటలకి సెల్ లో అల్లారం మోగుతోంది.

వెంకటరమణ లేచి అల్లారం ఆపి అలివేలుని లేపాడు.

రమణ ముఖం కడుక్కుని బకెట్ తీసుకుని వేడి నీళ్ళ కోసం బయటికి వెళ్ళాడు.

ఇంతలో అలివేలు ముఖం కడుక్కుని వేడినీళ్ళ కోసం చూస్తోంది.

రమణ వేడినీళ్ళ బకెట్ తీసుకొచ్చి లోపల బకెట్ లో పోసి మళ్ళీ ఇంకో బకెట్ కోసం వెళ్ళాడు. ఈ లోగా అలివేలు స్నానం చేసి తయారయింది. వెంకటేశాన్ని లేపింది.

రమణ ఇంకో బకెట్ తీసుకు వచ్చాడు. దాంతో వెంకటేశానికి స్నానం చేయించింది. రమణ ఇంకో బకెట్ తో నీళ్ళు తెచ్చుకుని స్నానం చేసి తయారయ్యాడు. టైం ఆరయ్యింది.

ఇద్దరూ కాఫీ తాగి, వెంకటేశానికి పాలు పట్టించారు. వెంకటేశానికి కావాల్సిన పాలు, సిరిలాక్ తీసుకున్నారు. 'ఏవండీ సెల్ ఫోను తీసుకున్నారా' అడిగింది అలివేలు.

'లోపల సెల్ ఫోను తీసుకెళ్ల నివ్వరు. నీ ఫోను కూడా సైలెన్స్ లో పెట్టి పెట్టెలో పెట్టేయ్యి.

అంటూ ఇద్దరి ఫోనులు సైలెన్సు మోడ్ లో పెట్టి సూట్ కేసు లో పడేసాడు. పర్సు తీసి అందులోంచి డబ్బులు తీసుకుని జేబులో పెట్టున్నాడు.

'అదేంటి పర్సు పెట్టు కోరా' అడిగింది అలివేలు.

'పర్సు వుండి ఎత్తుగా కనపడితే ఆ రష్ లో ఎవడయినా జేబు కొట్టేస్తాడు.' అంటూ పర్సు కూడా సూట్ కేసులో పడేసాడు.

అలివేలు దర్శనానికి బయలు దేరారు.

అక్కడే వున్న సమాచార కేంద్రం లో 'దర్శనానికి ఎంత సేపు పడుతుంది' అడిగాడు.

'ఫ్రీ దర్సనం అయితే ఆరేడు గంటలు పడుతుంది. మూడు వందలు టికట్ శీఘ్ర దర్శనం అయితే రెండు మూడు గంటలలో అయిపోతుంది.' అంటూ చెప్పాడు.

'మూడు వందలు టికెట్ తీసుకుని వెళ్దాం. మూడు గంటల్లో అయిపోతుందిగా' అంది అలివేలు.

'అవును. అసలే నిన్నంతా నీలాలతోతే సారిపోయింది. సాయంత్రం నాలుగు గంటలకి ట్రైను. ఇప్పుడు ఏడవుతోంది. పన్నెండు గంటల కల్లా బయటికి వచ్చేయ్యచ్చు. మూడువందల టికెట్ కి వెళదాం.' అన్నాడు రమణ .

'టికెట్ ఎక్కడ ఇస్తారు' అంటూ కేంద్రం లో అడిగాడు రమణ

'వెళ్లి లైనులో నిలబడండి.. మధ్యలో టికట్ కౌంటర్ వుంది. అందులో ఇస్తారు.' అన్నాడు.

'దారి ఎటు..' అడిగాడు రమణ

'అదిగో బోర్డు' అంటూ చూపించాడు.

రమణ చూసాడు.

‘శీఘ్ర దర్శనం.. మూడు వందలు టికట్ కి దారి’ అంటూ బాణం గుర్తు గల బోర్డు కనిపించింది.

ముగ్గురూ ఆ బోర్డు చూసుకుంటూ వెళ్ళారు. కొంత దూరం వెళ్ళిన తర్వాత మరో బోర్డు. అలా నాలుగయిదు మలుపులు, ఒక అర కిలోమీటరు వెళ్ళిన తర్వాత వైకుంఠం కాంప్లెక్స్ వచ్చింది. అది దాటి వెళ్ళిన కొంత దూరం లో ఒక చోట ఒక గేటు కనిపించింది. దాని మీద ‘శీఘ్ర దర్శనానికి దారి’ అనిరాసి వుంది. వెంకట రమణ చూసాడు.

‘అదిగో అక్కడ గేటు వుంది పద’ అంటూ వెళ్ళాడు.

దగ్గిరకి వెళ్ళే సరికి దాని తలుపులు వేసి అడ్డంగా చెక్కలూ, ఏవో పెట్టారు.

‘ఇదేంటి.. తలుపులు వేసి ఏవో పెట్టారు. ఇప్పుడు ఎలా వెళ్ళాలి’ అనుకున్నాడు.

ఇంతలో వెనకాల నుంచి ఓ నలుగురు వచ్చి

‘ఏమిటండి తలుపు వేసి వుంది. ఎలా వెళ్ళాలి’ అడిగారు

‘మీ కెంత తెలుసో నాకు అంతే తెలుసు’ అన్నాడు.

నలుగురు మాట్లాడకుండా వెళ్లి పోయారు.

‘అదేమిటండి అలా అన్నారు’ అంది అలివేలు

‘ఆ గుండు లైనులో వాడెవడో నన్ను ఆనలేదా’ అన్నాడు రమణ

‘మనం ఇప్పుడు ఎలా వెళ్ళాలి’ అడిగింది అలివేలు.

కొంచెం దూరం లో సమాచార కేంద్రం కనిపించింది.

వెళ్లి ‘ సార్ .. ఆ బోర్డుల ప్రకారం వస్తే గేటు మూసివుంది. మూడువందల శీఘ్ర దర్శనానికి ఎలా వెళ్ళాలి.’ అంటూ అడిగాడు.

‘అవన్నీ పాత బోర్డులు. శీఘ్ర దర్శనానికి ఇండియా కాఫీ హౌస్ పక్కన గేటు వుంది వెళ్ళండి.’ అన్నాడు.

‘ఇండియా కాఫీ హౌస్ ఎక్కడ’ అడిగాడు రమణ

‘అలా వెనక్కి వెళ్లి కుడిచేతి వైపుకి తిరిగితే ఇండియా కాఫీ హౌస్ వస్తుంది.’ అన్నాడు.

ఈసురో మంటూ ఓ కిలోమీటరు వెతుక్కుంటూ వెళ్ళాడు. కడుపులో కాస్త కరకరమనే సరికి అక్కడే పక్కనే ఇడ్లీలు అమ్ముతుంటే కాస్త టిఫిన్ తిని వెతకడం మొదలు పెట్టారు.

వెతగ్గా.. వెతగ్గా ఇండియా కాఫీ హౌస్ కనిపించింది. దాని పక్కనే గేటు కనిపించింది.

వెంకట రమణ ఆనందంతో ‘అదిగో గేటు దొరికింది. పద’ అంటూ వెళ్ళాడు.

ఇద్దరూ గేటులో కి వెళ్ళారు. ఖాళీ గా వుంది. అమ్మో ఎంత ఖాళీ గా వుందో. శీఘ్ర దర్శనం కదా డైరెక్టుగా వెళ్లి పోవటమే’ అంటూ వెళ్ళారు. కొంత దూరం వెళ్ళే సరికి లైనులో జనాలు కనిపించేరు. లైను ఆగి పోయింది. కొంతమంది తీరుబడిగా కూర్చుని వున్నారు.

‘ఇదేంటి ఆగి పోయింది. ఏంటి అలా కూర్చున్నారు.’ అడిగాడు వెంకట రమణ

‘దర్శనానికి తొమ్మిదిన్నరకి వదులుతారట.’ అన్నాడు ఓ వ్యక్తి

టైం చూసుకున్నాడు రమణ. ఎనిమిది అయింది. ‘ఇంకా గంటన్నర’ అనుకున్నాడు.

అలివేలు పిల్లాడిని ఎత్తుకోలేక లైనులో కూర్చుండి పోయింది. మెల్లిగా ఫ్లాస్క్, ఓ కప్పు తీసుకుని కొంచెం సిరిలాక్ కలిపి వెంకటేశానికి తినిపించింది.

కాసేపటికి వెనక వున్న ఖాళీ లైను మొత్తం భక్తులతో నిండిపోయింది.

కొందరు ఏవో కబుర్లు చెప్పు కుంటున్నారు.

కొందరు ఉండుండి ఒక్కసారి ‘ఏడుకొండల వాడా.. వెంకట రమణా ..గోవిందా..గోవింద..’ అంటూ అరుస్తున్నారు.

వెంకటరమణ గడియారం చూసుకున్నాడు. ‘ఎనిమిదిన్నర.. ఇంకా గంటా’ అనుకున్నాడు.

ఇంతలో బయట ఒకతను ‘న్యూస్ పేపర్.. తెలుగు, తమిల్, కన్నడ, హిందీ, ఇంగ్లిష్’ అంటూ అన్ని బాషల పేపర్లు అమ్ముతున్నాడు.

‘బాబూ .. ఈనాడు ఇయ్యి’ అంటూ పిలిచాడు.

ఆ కుర్రాడు పేపరు ఇచ్చాడు.

వెంకట రమణ ఐదు రూపాయలు ఇచ్చాడు.

'ఐదు కాదు.. ఏడు రూపాయలు' అన్నాడు పేపరు కుర్రాడు.

'పేపరు అయిదు రూపాయలే గా..' అన్నాడు వెంకట రమణ

'ఆ పేపరు ఇలా ఇచ్చి బయటికి వెళ్లి తెచ్చుకో' అన్నాడు పేపరు కుర్రాడు.

పరిస్థితులని బట్టి రెట్లు మారుతూంటాయి.. అనుకుని రెండు రూపాయలు తీసి ఇచ్చి చదవడానికి పేపరు ఓపెన్ చేసాడు.

ఇంతలో పక్కతను 'సార్ .చిన్న పేపర్ ఓసారి ఇస్తారా' అంటూ అడిగాడు

వెంకట రమణ ఇచ్చాడు.

మెయిన్ పేపరు చదువు తున్నాడు.

అందరూ నిలబడలేక కూర్చుని వెంకటరమణ కొన్న పేపరు చదువుతున్నారు.

ముందున్న వ్యక్తి పేపర్ చూసి 'సార్ లోపలి పేపరు ఇస్తారా' అంటూ అడిగాడు

వెంకట రమణ కోపంగా చూసాడు.

'ప్లీజ్' అన్నాడు

ఏమీ అనలేక లోపలి పేజీలు ఇచ్చాడు. చేతిలో వున్న పేపరు చదివి తరువాతి పేపరు చదువుదామని చూసే సరికి తన పేపరు ని ముందు నలుగురు, వెనకాల పది మంది తలో పేపరు తీసుకుని చదువుతున్నారు. ముందు వ్యక్తి వెంకట రమణ ని చూసి ఓ నవ్వు నవ్వి తన చేతిలో పేపరు వెంకటరమణ కి ఇచ్చి వెంకటరమణ చేతిలో పేపరు తీసుకున్నాడు.

వెంకటరమణ       ఏడవలేక నవ్వుతూ పేపరు తీసుకుని చదువుతున్నాడు.

ఇంతలో ఒక్కసారిగా 'ఏడుకొండల వాడా.. వెంకట రమణా ..గోవిందా..గోవింద..' అంటూ అరుపు వినిపించే సరికి ముందున్న అందరూ గబా గబా లేచి నిలబడ్డారు.

వెంకట రమణ టైం చూసుకున్నాడు. తొమ్మిదిన్నర అయ్యింది.

'కరక్టు టైం' అనుకున్నాడు.

అలివేలు కూడా వెంకటేశాన్ని ఎత్తుకుని నిలబడింది. వెంకట రమణ బాగ్ తీసుకుని నిలబడ్డాడు.

వెనకాల కూడా అందరూ లెంచి నిలబడ్డారు.

లైను కదలడం మొదలయింది.

ఆ తోపులాటకి కొందరు వెనకా ముందు అయ్యారు.

వెంకటరమణ అలివేలు వెనకాలే నడుచుకుంటూ కదిలాడు.

కాస్త దూరం వెళ్లి లైను మళ్ళీ ఆగింది.

వెంకట రమణ పేపరు కోసం చూసాడు.

ఆ పేపరు తీసుకున్న వాళ్ళు ఎక్కడున్నారో కనపడలేదు.

‘పేపరు నా కోసం కొన్నానా.. వాళ్ళ కోసం కోన్నానా.. ఖర్మ రా..’ అనుకున్నాడు.

మళ్ళీ లైను కదలటం మొదలయింది.

అందరూ గోవిందా అంటూ నడుస్తున్నారు.

'భక్తులు దయచేసి గమనించగలరు. సెల్ ఫోనులు, కెమెరాలు, ఆలయం లోకి తీసుకు వెళ్ళడానికి అనుమతి లేదు. భక్తులు వాటిని తమ లాకర్ల లో గాని, గదులలో గాని, బయట వున్న డిపాజిట్ కౌంటర్ లలో గాని పెట్టుకుని రాగలరు. ఒకవేళ తీసుకువచ్చిన యెడల స్కానింగులో దొరికిన వస్తువులను స్వామివారి హుండీలో వేయబడును’ అంటూ స్పీకర్ లో నుంచి ఎనౌన్స్ మెంటు అన్ని బాషలలో వస్తోంది.

‘మనం తీసుకురాకపోవడం మంచిదయ్యింది’ అంది అలివేలు.

‘అందుకే గా రూమ్ లో పెట్టింది’ అన్నాడు వెంకట రమణ

దాని పర్యవసానం ఏం జరుగుతుందో అప్పుడు అర్ధం కాలేదు వెంకట రమణకి.

లైను కొంచెం కొంచెం జరిగి మూడువందల టికట్ కౌంటర్ దగ్గర కి వచ్చాడు వెంకట రమణ.

కౌంటర్లో రెండు టికట్ లు తీసుకుని ముగ్గురూ ముందుకికదిలారు.ముందు లైను అంతా ఖాళీ గా వుంది.

'అందరూ టికట్లు తీసుకోవాలిగా.. అందుకే అంత స్లో గా నడిచింది. పద..పద' అంటూ గబా గబా వెళ్ళారు.

అలా వైకుంఠం కాంప్లెక్స్ లోకి వెళ్ళారు. అక్కడ కొంచెం ముందుకి వెళ్ళే సరికి మళ్ళీ లైను ఆగిపోయింది.

అక్కడ కొంత మంది టికట్లు చెక్ చేస్తున్నారు. ఎవరి ముఖాల్లో శాంతం గాని, ప్రేమ గాని, దేవుడి యందు భక్తీ గాని, ఎంతో దూరం నుంచి ఎంతో సేపటినుంచి లైనులో నిలబడి అలసిపోయిన భక్తుల గురించి జాలి గాని, తాము చేస్తున్నా ఉద్యోగం అదేకదా.. అలా అని ఉద్యోగ ధర్మం గాని లేకుండా 'ఎయి.. టికట్లు..తియ్యండి.. ఇవ్వండి.. ఎంత మంది.....ఆ.. వెళ్ళండి..' అంటూ పశువులని అదిలించినట్టు అరుస్తూ అక్కడి ఉద్యోగులు టిక్కట్లు చెక్ చేసి లోపలికి పంపారు.

అలాగే వాళ్ళ ఈసడింపులతో టికట్లు చెక్ చేయించుకుని వెళ్ళారు వెంకటరమణ దంపతులు.

కాస్త ముందుకి వెళ్ళగానే కంపార్టుమెంటు లు కనిపించాయి. 18-25 అని బోర్డు రాసి ఉంది. అలా మూడు నాలుగు కంపార్ట్ మెంట్లు దాటుకుని ముందుకి వెళ్ళారు. వెంకట రమణ దంపతులు వెళ్ళే సరికి పంతొమ్మిది కంపార్ట్ మెంటు నిండిపోవడం తో దాని తలుపు వేసి ఇరవయ్ కంపార్ట్ మెంట్ తెలుపు తీసి 'వెళ్ళండి లోపల కూర్చోండి' అంటూ లోపలికి పంపించారు. ఇరవయ్ కంపార్ట్ మెంటు లోకి ముందుగా వెళ్ళింది వెంకట రమణ దంపతులు. వెళ్లి ముందు ఒక బెంచి వుంటే దాని మీద కూర్చున్నారు.

తర్వాత ఒక్కొకళ్ళు వచ్చి కూర్చుంటున్నారు. అయిదు నిముషాల తరువాత బిల బిల మంటూ చిన్న పిల్లలు, పెద్దవాళ్ళూ అందరూ ఒకర్నొకరు తోసుకుంటూ ఓ రెండు వందల మంది లోపలి గోల గోలగా వచ్చారు. ఆ గోలకి చిన్న పిల్లలు భయపడి బిక్కు బిక్కు మంటూ చూస్తున్నారు. ఇరవై కంపార్టు మెంట్ నిండిపోవడం తో తలుపు వేసి ఇరవయ్ ఒకటి ఓపెన్ చేసారు.

ఆ జనాన్ని చూసి అలివేలు భయపడింది. 'ఇదేంటండి ఇంత మంది జనం' అంది

‘అదే తిరపతి దేవుడి మహాత్యం’ అన్నాడు.

టైం చూసు కున్నాడు. పదకొండున్నర అయ్యింది. ‘లైనులో నిలబడి అప్పుడే మూడు గంటలు అయింది. అనుకున్నాడు.

అందరూ అలా కంపార్ట్ మెంట్ లో కూర్చుని కబుర్లు చెప్పు కుంటున్నారు. చిన్నపిల్లలు ఏడుస్తున్నారు.వాళ్ళ తల్లులు ఊరుకో బెడుతున్నారు.

గడియారం పన్నెండున్నర అయింది. ఎక్కడా తలుపు తీసే జాడ కనిపించ లేదు. వెంకటేశం ఏడుపు మొదలు పెట్టాడు. అలివేలు ఫ్లాస్క్ తీసి సిరిలాక్ కలుపుతోంది. ఇంతలో గార్డు తలుపు దగ్గరికివచ్చాడు. కొంత మంది ఒక్కసారిగా గోవిందా.. గోవిందా అంటూ ఒకరి నొకరు తోసుకుంటూ అలివేలు కలుపుతున్న సిరిలాక్ కప్పుని , ఫ్లాస్క్ ని తన్నుకుంటూ తలుపు దగ్గిరకి పరుగెత్తారు. మొత్తం సిరిలాక్, ఫ్లాస్క్ లో వున్న పాలు నేల పాలయ్యాయి. వెంకటేశం భయపడి ఇంకా ఏడుపు లంకించు కున్నాడు. అలివేలు కి ఏం చెయ్యాలో తోచలేదు.

తలుపు దగ్గిర తోపులాట మొదలయింది. తలుపు దగ్గిర గార్డు తలుపు తియ్యకుండా వెళ్లిపోయాడు. అందరూ అక్కడే నిలబడి వున్నారు.

పక్కనే వున్న ఒకావిడ తన దగ్గరున్న రెండు బిస్కట్లు అలివేలు కి ఇచ్చింది. వాటిని చిన్న ముక్కలు చేసి వెంకటేశానికి తినిపించింది.

కంపార్ట్ మెంట్ మూలలో వున్న కటకటాలలోకి ఒకతను సమూసాలు ఓ అట్టపెట్టిలో పెట్టి అమ్మడానికి తీసుకువచ్చాడు. వెంటనే జనాలు అందరూ గుంపుగా చేరి ఒకరి మీద ఒకరు తోసుకుంటూ కొనటానికి పోటీ పడ్డారు. అమ్మే అతను కనక ఆ కటకటాల లో లేకపోతే అతన్ని తొక్కి పచ్చడి చేసేవారు. అయిదు నిముషాల్లోపే ఆ పెట్టి ఖాళీ అయిపోయింది.

(ముగింపు వచ్చేసంచికలో...)




ప్రారంభమైన పదిరోజులకే కాలేజికి సెలవులు ఇచ్చారు. స్కూలులో ఉన్నప్పుడు సెలవుల కోసం ఎంత ఎదురుచూసినా, అవి త్వరగా వచ్చేవికావు. ఈ ట్రైన్ ఎంత నెమ్మదిగా పరిగెడుతోంది? ఎప్పుడు మా ఊరు చేరుకొంటుంది ఈ ట్రైను? అసలు మా ఊరులోనే, మంచి కాలేజ్ ఉంటే బాగుండేది. కలవరింతలు కరిగిపోయి కలలైన కాలంలో, బాల్యం మాత్రం, ఒక రంగులకాగితపు పువ్వు చుట్టూ భ్రమలో తిరిగే, భ్రమరం.

బాల్యం అంతా, ఇంకా నా కళ్ళముందే ఉంది. మా ఊరులో వేసవిలో కొనుక్కున్న ఐస్, శీతాకాలపు మొక్కజొన్న గింజల రుచులూ, చలి మంచు తెరలూ, కాలాలకు అనుగుణంగా ఊరు రంగులు మార్చుకొంటుందో, లేక కాలాలే ఊరి రంగులు మార్చేస్తాయో, ఏమో కాని, నా చిన్నప్పటి జ్ఞాపకాల తెర, ఈ ప్రపంచాన్ని నాకళ్ళకు చూపిస్తుంది. చిన్నప్పుడు జరిగిన అన్ని విషయాలూ ఇప్పుడు నాకు గుర్తులేవు. కానీ గుర్తున్నవన్నీ, నా జీవితపు రహదారినుండి, నేను తిరుగు ప్రయాణం చేస్తున్నట్టు, చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి, వినపడుతున్నాయి. గుడిగంటలు వినపడగానే, నేను అల్లరిచేయటం మానేసి, శ్రద్ధగా దేవుని ముందు నిలబడి, అమ్మ చెప్పినట్లు కోరుకొనేదాన్ని. "స్వామి, నాకు చూపు నివ్వు. నేను నా కళ్ళతో ఈ లోకాన్ని చూడాలి."

స్నేహితులు రేఖా, అంజలీ, ఎలా మాట్లాడతారో అనుకరించి చూపించటం, సోనూ పుస్తకాలలో పెన్నులతో గీతలు గీయడం, వంటరిగా ఉన్నప్పుడు టీవీతో మాట్లాడటం, అసలు నా చిన్నతనం ఎంత చక్కగా గడిచిపోయిందో చెప్పలేను.

"సర్వేంద్రియానాం, నయనం ప్రధానం" అంటారు కానీ, చిన్నప్పుడు, నాకు తెలియని ప్రపంచం ఇంకేదో ఉందని, దాన్ని నేనెప్పుడూ చూడలేదని, అనిపిస్తుందా? అప్పటివరకూ మండుతున్న ఎండకాస్తా, తగ్గుతుంటే అనిపించింది వర్షం రావచ్చని, స్కూలుకు సెలవు ఇస్తారని. కానీ, అవి మబ్బులు మాత్రమే. వర్షం కురిసింది. కానీ మేమంతా ఇంటికి వెళ్ళిపోయాక. నాకు అసలు పడవలు చేయటం వచ్చేది కాదు. కాగితాలన్నీ, చింపి, ముక్కలు చేస్తున్నానని శారదక్క కసురుకోనేది. నేను పడవలు చేయటం నేర్చుకొనేసరికి, ఇంత పెద్దదాన్ని ఐపోయాను. ఈ విద్య అప్పుడే వచ్చి ఉంటే, శారదక్కను కాగితంతో పడవలు చేయమని బ్రతిమాల్సిన అవసరం ఉండేది కాదుకదా. అమ్మ మాత్రం, ఎప్పుడూ చెప్తుంది, ఎవరినైనా ఏదైనా అడగాలంటే, బాధపడకూడదూ అని. కానీ, నేను చీకట్లో నీలిమా వాళ్ళ ఇంటికి వెళ్ళటానికి కూడా, ఎవరినీ తోడుగా రమ్మని అడిగేదాన్ని కాదు. అసలు చీకటంటే, ఒక భావన మాత్రమే అని తరువాత తెలిసింది. గరుకు ఇసుకలో, మోగే గవ్వలు ఏరిన ఆ బాల్యపు ఆటపాటలే, లెక్కలపలకపై బలపాలతో అంకెలు నేర్పించాయి. ఎన్నో వాసనలున్న పూలకు, రంగులు కూడా ఎన్నో ఉంటాయని మల్లికార్జున్ మాస్టారు గారు ఎప్పుడూ చెప్పేవారు. అన్ని వేరువేరు గొంతులకూ, వేరువేరు రూపాలు ఉంటాయనీ, నేనే నెమ్మదిగా తెలుసుకున్నా.
ముళ్ళగోరింటపూలంత తేలికగా, బ్రెయిలీ పాటాలు ఉండేవి. పరీక్షనాళికలను సారాదీపంతో వెలిగించకపోయినా, పరీక్షలు ఒక్కో తరగతినీ అలవోకగా దాటించాయి. ఇంద్రధనుసూ, నక్షత్రాలూ, వెన్నెలా, ఇవేనా ప్రకృతంటే? రాత్రిని గెలిచేందుకు పోటీపడే సన్నజాజి, విరజాజి పరిమళాలూ, సముద్రం చుట్టూ కాపు కాసే గాలితరంగాలూ, కొట్టి పారిపోతున్న చిన్నీని పట్టుకోమని చెప్పే పట్టీల సవ్వడులూ, ఎర్రగా పండినా పండకపోయినా, వేళ్ళను అరచేతులలో దాచిపెట్టే గోరింటాకు గుర్తులూ, ఇవేకదా సైసవం స్పృశించిన ప్రకృతి కాంతులూ?

బాల్యం దూరమవుతున్నకొద్దీ, నిజం దగ్గరవుతుంది. వయసు పెరిగేకొద్దీ, మనసు బరువవుతుంది. నాకు చిన్నప్పటి, ఆ కోరికలేదు చూపు వచ్చేయాలని. కోరికలకూ, కలలకూ కొత్తరూపం వచ్చింది. రూపాయి బిళ్ళల శబ్దంలో తేడాలు గమనిస్తూ, కరిగిన బాల్యం, యవ్వనంలో కొత్త తివాచి పరచింది. ఇన్ని సంవత్సరాల తరువాత, ఈ ప్రయాణం, ఇంకా ఏమి చూపిస్తుందో తెలియదు. కాటుకన్నా, అరిచే కుక్కన్నా, కూసే కుక్కర్ అన్నా, ఎక్సేలేటర్ అన్నా, ఇప్పటికీ భయం పోలేదు. అష్టా చెమ్మా ఆటల్లో చింతగింజలపై, చాక్ పీస్ పొడిపై, ఇప్పటికీ ఇష్టం పోలేదు. చాక్లేట్ తగరముతో పాపాయిబొమ్మలు చేసిన చేతులకు ఏదైనా వస్తువు పొరపాటున తగిలి పడిపోతే, మనసులో కలిగే కంగారు, ఇప్పుడు తన రూపం మార్చుకుంది అంతే. ఆడపిల్లల్లా పూలు మాలకట్టడం రాలేదనీ అమ్మ ఎంత తిట్టినా, పూలు వాటంతట అవి దారంలో చిక్కుకోలేవుకదా. అలసిన రెప్పల అలికిడికూడా, వినగలిగేంత తేలికేంకాదు.




కంపార్ట్ మెంట్లో పాలు , ప్రసాదం ఫ్రీ గా ఇస్తారన్నారు.' అనుకుంటూ ఆమాట పైకే అన్నాడు.

'అవి ఇదివరకు. ఇప్పుడు కాదు. ఎప్పుడో ఒకసారి. దానికి మనకి ప్రాప్తం వుండాలి' అన్నాడు ఒకాయన

ఇంతలో గార్డు వచ్చి తలుపు తీసాడు.

జనాలు అందరూ లైనులోకి వెళ్ళడానికి ఒకొర్నొకరు తోసుకుంటూన్నారు. కొంతమంది పిల్లలు నలిగి పోయి ఏడుస్తున్నారు. కుర్రాళ్ళు అదేమీ పట్టించు కోవడం లేదు. తోస్తూనే వున్నారు. ఆడపిల్లలు కూడా వాళ్ళ మధ్యలో పడి నెట్టలేక, బయటికి రాలేక నలిగి పోతున్నారు. బలవంతులు తోసుకుని లైనులోకి వెళుతున్నారు. బలం లేనివాళ్ళు బలం తెచ్చుకుని తోస్తున్నారు. నిజం చెప్పాలంటే పశువులు కూడా అలా తోసుకు వెళ్ళవు.

అది భక్తా...బలప్రదర్సనా అర్ధం కాలేదు. అలివేలుకి , వెంకట రమణకి

అలివేలుకి ఆ దృశ్యం చూసి భయం వేసింది. 'అందరు వెళ్ళాక వెళదాం , అంటూ అలాగే కూర్చుంది. కాసేపటికి అందరూ వెళ్లి పోయారు. ఆఖర్న వెంకటరమణ దంపతులు మెల్లిగా వెళ్లారు.

వాళ్ళు లైను లోకి వెళ్ళిన వెంటనే యాభై రూపాయల సర్వ దర్సనం కంపార్టు మెంటు వాళ్ళని వదిలారు. వాళ్ళు గుంపుగా వచ్చి వీళ్ళ మీద పడ్డారు. దాంతో వెంకటరమణ దంపతులు మధ్యలో నలిగి పోయారు. వెంకటేశం ఏడుపు మొదలు పెట్టాడు. అందరూ తోస్తున్నారు. లైను మెల్లిగా కదులు తోంది. తోసుకోవడాలు ఎక్కువ అయ్యాయి.

అలివేలు ఇంక పిల్లాడితో నిలబడ లేక వెంకటేశాన్ని వెంకటరమణ కి ఇచ్చింది. వెంకట రమణ వెంకటేశాన్ని భుజాలమీదకి ఎక్కించు కున్నాడు. కాస్త గాలి తగలడం తో వెంకటేశం ఏడుపు ఆపాడు.

ఓ పది నిముషాలు లైను కదిలి ఆగిపోయింది.

గంట... అరగంట...గంట..రెండు.. గంటలు.. లైను ఆగి పోయింది.

అలివేలు 'ఏవండి దర్సనం వద్దు,ఏమి వద్దు.. బయటికి పోదాం' అంది

వెంకట రమణకి బయటికి వెళ్ళే చాన్సే లేదు. వెనకా..ముందూ.. వేలమంది లైనులో నిలబడి వున్నారు. కాలు కదిపే చోటు లేదు. మధ్యలో తోసుకోవడాలు.

ఇంతలో ఓ లావుపాటి ఆయన అలివేలు కాలు తొక్కాడు.

అలివేలు 'కెవ్వు' మంటూ అరిచింది.

'సారీ' అన్నాడు.

అలివేలుకి కళ్ళ వెంట నీళ్ళు వచ్చాయి.

'ఎం మొక్కో...జన్మలో తిరుపతి రా కూడదు.' అనుకుంది.

వెంకట రమణ భుజాల మీదనుంచి వెంకటేశాన్ని దింపి అలివేలుకి ఇచ్చాడు.

అలివేలు కాలి నెప్పి తో అలాగే ఎత్తుకుంది.

ఇంతలో గోవిందా అంటూ ఒక్క సారి కదిలింది లైను.

అక్కడే ఓ మలుపు వచ్చింది.

సరిగ్గా అ మలుపు దగ్గరే శీఘ్ర దర్శనం, యాభై రూపాలయ దర్శనం, సర్వ దర్శనం, అన్నీ దర్శనాల వాళ్ళందరినీ ఒకే లైనుగా కలుపుతారు. అక్కడి నుంచి కొంత దూరం వెళ్ళాక మళ్ళీ అలైను రెండుగా విడి పోతుంది. అక్కడ పరిస్థితి మరీ భయంకరంగా వుంది. చంటి పిల్లల ఏడుపులతో, పెద్దవాళ్ళ చిరాకులతో, కుర్రకారు

గోలలతో, భక్తుల గోవింద నామం తో ఆడవాళ్ళ చిరాకులతో, లైనుని కంట్రోల్ చేసే వాళ్ళు లేక నానా భీబత్సంగా వుంది. అలా తోసుకుంటూ అలివేలు, వెంకటరమణ అక్కడికి చేరు కున్నారు. ఇంతలో వెనక నుంచి జనం ఒక్కసారిగా గోవిందా అంటూ ముందుకి తోసారు. దాంతో అలివేలు, వెంకట రమణ, ఇద్దరూ చెరో లైనులోకి కొంత దూరం వెళ్లి పోయారు. అలా తోపులాటలో అలివేలు లైను ఆగిపోయింది. వెంకటరమణ లైను ముందుకి సాగి పోయింది. వాళ్ళ తో పాటే వెంకట రమణని కూడా వాళ్ళు తోసుకుంటూ పోయారు.

అలివేలు కి వెంకట రమణ కనిపించక పోవడం తో ఏడుపు వచ్చినంత పనయింది.

లైనులో వున్న వాళ్ళు'భయ పడకమ్మా.. మేం వున్నాం ..నీ కేం భయం లేదు. మీ వారు నీ కోసం ముందు ఆగి వెయిట్ చేస్తూ వుంటారు లే.' అంటూ ధైర్యం చెప్పారు.

'మీరు మాత్రం ఏక్కడి వరకు ఉంటారో ఎవరికీ తెలుసు.' అంది

'చూడమ్మా దర్శనం అయ్యాక బయటికి వెళ్లి మీ వారికి ఫోన్ చెయ్యి.' అన్నాడు ఒకాయన.

'ఫోనా.. లోపలి తీసుకు రాకూడ దన్నారని రూమ్ లో పెట్టాం. ' అంది అలివేలు

'పోనీ ఎవరి దగ్గరయినా అడిగి చేసుకోవచ్చు లేమ్మా.'.అన్నాడు ఒకాయన.

'ఎవరి దగ్గరయినా ..నాకు నెంబరు కూడా గుర్తు లేదు.' అంతో కంగారు పడింది అలివేలు.

'మీ ఆయన సెల్ నెంబరు గుర్తు లేక పోతే ఎలాగమ్మా .' అంది ఒకావిడ.

‘మీరు చెప్పండి మీ ఆయన సెల్ నెంబరు’ అంది అలివేలు.

ఆవిడ మా ఆయన సెల్ నంబరు.. నైన్..టు..ఫోర్.... నైన్..టు..ఫోర్. .’.అంటూ ఆగిపోయింది

‘అలాగే వుంటుంది.’ అంది అలివేలు.

‘అవునండి బాబు ఇదివరకు మాన్యుల్ ఫోనులున్నప్పుడయితే నలభై..యాభై నెంబర్లు గుర్తుకి ఉండేవి. వేలు ఆటోమేటిక్ గా డయల్ చేసేది. ఇప్పుడు ఈ సెల్ ఫోన్ వచ్చాకా ఎవడి నెంబరయినా మేమోరీ చూసి కాల్ చెయ్యడమే గాని ఒక్క నెంబరు తెలీదు. గుర్తుకి కూడా రావడం లేదు . ’ అన్నాడు ఒకాయన.

‘ఎ కాటేజి లో దిగారు’ అంటూ అడిగింది ఒకావిడ.

‘ఏమో .. తెలీదు.’ అంది అలివేలు.

‘తెలిక పోతే ఎలాగా. ఇక్కడ కలుసుకో లేక పోతే అక్కడయినా కలవచ్చు. ఇప్పుడేలాగా ‘ అంది ఒకావిడ

దాంతో భయపడ్డా అలివేలుకి ఏడుపు ఆగలేదు. వెంకటేశం తల్లి ని చూసి ఏడవడం మొదలు పెట్టాడు.

‘వూరుకోమ్మా.. మేం ఎదో ఒకటి చేసి మీ వారిని కలుపుతాం . సరేనా’ అంటూ ఊరుకో బెట్టారు.

ఇంతలో లైను కదిలింది.

అందరూ ముందుకి కదిలారు.

అక్కడ వెంకట రమణ ఆ లైనులో వెళ్లి వెళ్లి మలుపు లు తిరిగి ఓ చోట నిల బడి పోయాడు. చుట్టూ చూసాడు. లైను తప్ప ఏమీ కనపడలేదు. ఎక్కడున్నాడో తెలిదు.

బయట ఏం జరుగుతోందో తెలీదు. సాయంత్రం నాలుగుగంటలకి ట్రైను. అలివేలు పిల్లాడి తో ఎక్కడుందో తెలీదు. ఛీ అనవసరంగా మొక్కు కున్నాను. ఇప్పుడు తిరుపతి రావడం అవసరమా. దేవుడు అన్ని చోట్లా ఉంటాడు అంటాడు. హైదరాబాద్ లో చిక్కడపల్లి గుడి లోనో, బిర్లా టెంపుల్ లోనో, చిల్కూరు లోనో తీయిస్తే బాగుండేది. ఈ గుండు గొడవ లేక పోతే నిన్ననే దర్సనం జరిగేది. హాయిగా కిందకి వెళ్ళిపోయేవాళ్ళం. అలివేలు ఎక్కడున్నావే.. ఏం చేస్తున్నావే.. పిల్లాడితో ఎంత అవస్థలు పడుతున్నావో... అంటూ తనలో తానే తిట్టు కుంటూ పిచ్చాడిలా ప్రవర్తిస్తున్నాడు .

అది చూసిన ఓ పక్కాయిన ' ఏమయింది మాస్టారూ' అంటూ అడిగాడు.

'నా బొంద అయింది. నేను మా ఆవిడా విడి పోయాం.' అన్నాడు

'పిల్లలు న్నారా' అడిగాడు ఆ వ్యక్తి

'ఆ ఒక అబ్బాయి '

' అబ్బాయి ఎక్కడున్నాడు'

'తల్లి దగ్గరే'

'పోనీ లెండి పిల్లలు తల్లి దగ్గర ఉండటమే ఉత్తమం. మగవాళ్ళం మనం పెంచ లేం.' అంటూ ఆగాడు

అర్ధం కాక వెంకట రమణ అతన్ని చూసాడు.

'అవునండి రేపు మీరో మరో పెళ్లి చేసుకుంటే పిల్లలు అడ్డేగా. మీ ఆవిడ మీ అబ్బాయిని తీసుకెళ్ళి మీకు రూటు క్లియర్ చేసింది. యు ఆర్ లక్కీ' అన్నాడు నవ్వుతూ.

అసలు సంగతి అర్ధం ఆయిన వెంకట రమణ అసలే చిరగ్గా వున్నాడేమో కోపం ఎక్కువయి ఏమీ అనలేక 'మీరు కాస్త నోరు మూస్తారా... మేం విడిపోయింది జీవితాల లోంచి కాదు. ఈ లైనులోంచి. మైను లైను దగ్గర తోసేసే సరికి ఇద్దరం చెరో లైనులోకి

పోయాం.' అన్నాడు.

'అలా జరిగిందా...సారీ..' అన్నాడు నాలిక కరుచు కుంటూ ఆ వ్యక్తి .

'అసలు మనం ఇప్పుడు ఎక్కడున్నాం' అడిగాడు పక్క వ్యక్తి.

'లైనులో' అన్నాడు మరో వ్యక్తి. అందరూ నవ్వారు.

వెంకటరమణ ఆ జోక్ కి నవ్వు రాలేదు కదా తిక్క నషాళానికి అంటింది.

అక్కడే నిలబడి పోయి గంట అయింది. ముందు కొంత మంది భక్తులు 'ఓం..నమో..నారాయణా... ఓం..నమో..నారాయణా... ఓం..నమో..నారాయణా...' అంటూ భజన చేస్తున్నారు.

అది వెంకట రమణ వున్నా పరిస్థితి కి భజన లా వినిపించడం లేదు. వాళ్ళ మీద తను తనకి తెలీకుండానే చిరాకు పడుతున్నాడు. 'వీళ్ళు ఆ భజన ఆపితే బాగుండేది' అనుకున్నాడు.

ఇంతలో లైను కదిలింది.

అలా కదులుతూ గాలి గోపురం వరకు వచ్చింది .

అక్కడ చెకింగు అయిపోయిన తర్వాత ఆలయ ద్వారం నుంచి లోపలి వెళ్ళాడు.

ఇదివరకు అక్కడ ద్వారం దగ్గర నీళ్ళు పారుతూ ఉండేవి. ఆటోమేటిక్ గా భక్తులు కాళ్ళు కడుగుకోటానికా అన్నట్టు. ఆరోజు నీళ్ళు లేవు.

'అరె ఇక్కడ నీళ్ళు లేవే' అన్నాడు ఓ వ్యక్తి.

'ఇక్కడ స్వామి వారికి కూడా వాటర్ ప్రోబ్లం ఉందన్న మాట ' అంటూ ఒకవ్యక్తి కౌంటరు వేసాడు.

అందరూ తోసుకుంటూ వెళ్ళారు.లోపలి వెళ్ళ గానే అందర్నీ ఆపేసాడు.

వెండి వాకిలి ముందు మూడు లైనులున్నాయి.

రెండు లైనులు డైరెక్ట్ గా వాకిలి కి రెండు వైపులనుంచి వున్నాయి. ఇంకొక లైను గోడవార చుట్టూ తిరుగుతూ వెండి వాకిలి ద్వారం దగ్గర కలుస్తోంది.

అంత వరకు ఓర్పు గా లైనులో నిలబడ్డ భక్తులకి బల పరీక్ష అక్కడినుండే మొదలవుతుంది. ఎవరికీ బలం వుంటే వాళ్ళు తోసుకు ముందుకి వెళ్లి పోవడమే.

ఇదంతా అక్కడున్న సెక్యూరిటీ స్టాఫ్, గార్డులు చూసి సంతోషిస్తూ వుంటారు.

కొంత మంది అయితే వాళ్ళని బలవంతంగా లైనుల్లోకి తోసేస్తూ ఆనందిస్తూ వుంటారు.

అలా ఒక్కసారి వదిలే సరికి జనం తోసుకుంటూ ముందుకి వచ్చారు. మూడు లైనులలో ఎ లైనులోకి వెళ్ళాలో తెలీక తికమక పడి ఇక్కడ నిలబడితే అలివేలు కనిపించ వచ్చు అనుకుంటూ ఏ లైనులోకి వెళ్ళకుండా పక్కన నిలబడ్డాడు.

ఇంతలో సెక్యూరిటీ గార్డ్ వచ్చి ఇక్కడ నిలబడ కూడదు వెళ్ళు అంటూ లైనులోకి తోసాడు. వెంకట రమణ గోడవార లైనులో పడ్డాడు. ఆ లైను గోడవార అలా మలుపులు తిరుగుతూ ఎప్పటికి వెండి వాకిలి చేరతామో ఆ వెంకటేశ్వర స్వామికి కూడా తెలీదు.

అలా ఆ మలుపులో నిలబడి పోయాడు.

ఇంతలో వి .ఐ.పి. బ్రేక్ దర్శనం టైం అయ్యింది. అంతే లైనులన్నీ మళ్ళీ ఆగిపోయాయి.

ఓ గంట తర్వాత మళ్ళీ కదిలాయి.

అలివేలు కూడాఅలా లైనులో వస్తూ వెంకటేశాన్ని ఎత్తుకుని వెండి వాకిలి ముందు ఆగింది. ఒక్కసారి అందరూ తొయ్యడం తో అలివేలు పిల్లాడితో సహా కింద పడి పోయింది. అందరికీ లోపలి వెళ్లాలనే తప్ప ఎవ్వరికీ పడిపోయిన అలివేలుని పైకి లేవ తియ్యాలని లేదు. అలాగే పక్కనుంచి తప్పించుకుంటూ వెళ్లి పోతున్నారు. వెంకటేశం ఏడుస్తున్నాడు.

ఇంతలో ఒక పెద్దయిన అలివేలుని లేపి ' జాగ్రత్తగా వెళ్ళమ్మా' అంటూ వెళ్ళాడు.

అలివేలు కట్టుకున్న పట్టు చీర నలిగి పోయి . బొట్టు , జుట్టు చెదిరి పోయి, వెంకటేశం నలిగి పోయి తుఫానులో కొట్టుకు వచ్చిన దానిలా వుంది.

అలాగే ఎక్కడయినా వెంకటరమణ కనబడతాడేమోనని చూసింది. ఎక్కడా కనబడలేదు.

ఇంతలో ఇంకో ట్రూపు ముందుకి తొయ్యడం తో ఎదురుగా వున్న లైనులో వెళ్లి పడింది. చుట్టూ జనం వుండటం తో కింద పడకుండా తన ప్రమేయం లేకుండా వెండి వాకిలి దాటింది. అక్కడ స్వామి వారి ఆనంద నిలయం దగ్గిరికి చేరింది.

అక్కడ అసలు బల పరీక్ష. నిజాయితీ గా , మెల్లగా లైనులో వెళితే స్వామి దర్శనం జరగదు. కళ్ళు మూసుకుని ఆ జనం లో తోసుకుంటూ కింద పడకుండా రాకట్ లో దూసుకు పోవడమే. కింద పడ్డామా డైరెక్టు గా స్వామిలో ఐక్యం అవ్వడమే. అందుకే భక్తులందరూ మానసికంగా, శారీరకంగా తోసుకోడానికి రడీ గా వుంటారు.

పాపం పిల్లల మీద, పిల్లలని ఎత్తుకున్న తల్లుల మీద గాని, ముసలి వాళ్ళ మీద గాని ఎవరికీ ఆఖరికి ఆలయ అధికారుల కి కూడా దయ లేదు. అందుకే గుంపులో గోవింద అన్న నానుడి అక్కడే పుట్టింది.

పాపం అలివేలు అలాగే దేవుడిని చూసి, వెంకటేశాన్ని వెంకటేశ్వరస్వామి కి చూపించాలని, వెంకటేశ్వర స్వామిని వెంకటేశా నికి చూపించాలనే తాపత్రయం తో భర్త వెంకట రమణ ఎక్కడ ఉన్నాడో చూసుకుంటూ అలాగే వెళ్లి నిలబడింది.

అందరూ తోసుకుంటూ వెళుతున్నారు.

వెండి వాకిలి ఎదురుగా వున్న ద్వారం తీసి వుంటే తిన్నగావెళ్లి ఎక్కువ శ్రమ లేకుండా స్వామి వారి దర్శనం చేసుకోవచ్చు.

కాని ఆనంద నిలయం ద్వారం పక్కగా ఉండటం వల్ల భక్తులు తోసుకుంటూ గోడవార వస్తున్న భక్తులను గోడకు నెట్టి వాళ్ళు మధ్యలో దూరి ఎవరు బలంగా వుంటే వాళ్ళు ముందుకు దూసుకు పోవడమే.

పాపం అలివేలు ఏడుస్తున్న వెంకటేశాన్ని ఎత్తుకుని మధ్యలో దూరి పోయింది.

జనాల తోపులాటలో మజ్జిగ కవ్వం లా ముందుకు వెనక్కి తిరుగుతూ మొత్తానికి ఆనంద నిలయం లోకి వెళ్ళింది. భక్తులు గోవిందా... గోవిందా అంటూ ముందుకి తోసుకుంటూ వెళ్తున్నారు. అలివేలు ముందు ఒకతను తన పిల్లాడిని

భుజాల మీదకి ఎక్కించుకుని గోవిందా అంటూ వెళ్తున్నాడు. అలివేలు కి అతని వీపు, పిల్లాడి వీపు తప్ప ముందు ఏమీ కనిపించడం లేదు. అలాగే వెంకటేశాన్ని ఎత్తి పట్టుకుని

'చూడు నాన్నా..జేజి..చూడు' అంటూ ముందుకు కదిలింది. ఆవ్యక్తి వెనక వాళ్ళకి కనబడితే నాకే, కనబడక పోతే నాకే అంటూ అలాగే ముందుకి వెళ్తూ స్వామికి దండం పెట్టు కుని వెళ్తున్నాడు. మహా లఘు దర్శనం కావటం వాళ్ళ ముందు వాకిలి వద్దే లైను తిప్పేసారు. అలివేలు ముందు వున్నా వ్యక్తిని 'జరగండి' అంటూ లాగేశారు.

'హమ్మయ్య స్వామి కనబడతాడు. దర్శనం చేసుకుందా మని అనుకుని స్వామిని చూసే లోగా జరుగమ్మా.. జరుగు.. ఎంత సేపు చూస్తావు అంటూ బయటికి లాగేశారు.

అలివేలు ఆవాక్కయి పోయింది. ఈ మాత్రం దానికి అంత దూరం నుంచి ఇంతదూరం, ఇంతసేపు లైనులో నిలబడి ఇన్ని కష్టాల కి ఓర్చి చివరకి తను దర్శనం చేసుకున్నట్టా. లేనట్టా ? తెలిక ఒక్కసారి ఉడుకుమోత్తనం తో ఏడుపు వచ్చేసింది.

'స్వామీ... నువ్వు సర్వాంతరయామివి. నన్ను క్షమించు. ఇంకా జన్మలో తిరుపతి రాను. ఇదే నా మొక్కు ' అంటూ వెంకటేశాన్ని తీసుకుని బయటికి వెళ్లి పోయింది.

పాపం వెంకట రమణకి అనుభవం ఒకటే అయినా మగవాడు కనుక ఏడవలేక సతీ సమేతంగా దర్శనం చేసుకుందా మనుకుంటే ఇలా చేశా వెంటి స్వామీ అని .. నీ అలివేలు మంగమ్మ నీతోనే వుంది. నా అలివేలు ఎక్కడుందో అనుకుంటూ వెతుక్కుంటూ బయటికి వచ్చాడు.

అక్కడ ఉచిత ప్రసాదాలు పంచి పెట్టె లైనులు నాలుగు వున్నాయి. ఒక లైనులో ఖాళీ గా వుందని కొంత మంది ఆ లైనులో వెళ్ళారు. ఆ వెనకే వెంకట రమణ కూడా వెళ్ళాడు. అక్కడ ఇంకో లైనులో ఒక స్వామి లావుగా వొంటి నిండా జుట్టుతో

వున్నాడు. అక్కడ ఆ లైనులో పులిహోర ప్రసాదం పంచుతున్నాడు. వెనక నుంచి ఇంకో లైను రావడం చూసి ' ఎవడ్రా.. ఈ లైను వదిలింది. ఇలా అయితే ప్రసాదం పంచను అంటూ పంచు తున్న పులిహోర ప్రసాదాన్ని ఒదిలి లేచి వెళ్లి పోయాడు.

ఇంతలో బక్క గా వున్న ఇంకో స్వామి వచ్చి రెండు లైను లో వాళ్లకి పులిహోర ప్రసాదం పంచుతున్నాడు.

వెంకట రమణ కి 'ఈ స్వామి ఎవడి కోసం ప్రసాదం పంచుతున్నాడు. దేవుడి కోసమా.. భక్తుల కోసమా.. తను చేస్తున్న ఉద్యోగం కోసమా...వీడి సొంత ఆస్తి పంచి ఇస్తున్నట్టు ఆ ఫీలింగు' ఏంటో అర్ధం కాలేదు. ఆ స్వామి..సొమ్ము తింటూ .. ఆ స్వామి మీద భక్తి లేక, ఆయన్నే నమ్ముకుని వచ్చిన భక్తులకు, సేవలు కాదు సదుపాయాలూ కూడా చూడ కుండ చీదరించుకుంటూ వున్న వాళ్ళని చూసి వెంకట రమణకి చిరాకు కలిగింది.

యుద్ధం లో పిల్లాడిని ఎత్తుకుని యుద్ధం చేసిన ఝాన్సీ లక్ష్మీ భాయి లా ఓటమో, గెలుపో తెలియని స్థితి లో వీరనారి గా గుడి బయటికి వచ్చింది.

ఎప్పుడో చిన్నపుడు వాళ్ళ అమ్మా, నాన్నలతో వచ్చింది. ఏమీ గుర్తు లేదు. ఎక్కడికి వెళ్ళాలో? ఎలా వెళ్ళాలో తెలీదు. ఫోన్ చేద్దామంటే ఫోన్ లేదు. ఎం చెయ్యాలో తెలియక

దిగాలుగా ఓ చోట కూర్చుని వుంది.

బయటికి వచ్చిన వెంకట రమణ బట్టలు నలిగి పోయి, జుట్టు చెదిరి పోయి పిచ్చి వాడిలా వున్నాడు. గడియారం చూసు కున్నాడు. మూడు నలభై అయింది. ఇప్పుడు కిందకి వెళ్ళినా రైలు వెళ్లి పోవటం ఖాయం. ఇంకా అలివేలు కనిపించలేదు. ఎక్కడుందో.. ఏమైందో . అలివేలు కోసం పిచ్చి పిచ్చి గా ఆ పరిసరాలు అన్నీ వెతికాడు. ఎక్కడా కనిపించ

లేదు. ఆలోచించాడు. ఓ ఐడియా వచ్చింది. ఒకవేళ తను ఎక్కడుందో వాళ్ళ అమ్మ నాన్నలకి ఫోన్ చేసి చెప్పిందేమో నని ఇంటికి ఫోన్ చెయ్యాలను కుని అక్కడ వున్న ఒకాయన్ని ' సార్ మా మిసెస్ మిస్సయ్యింది. ఒక్క కాల్ చేసుకోవాలి. ప్లీజ్ ' అంటూ ఫోన్ అడిగాడు.

'తీసుకోండి.' అంటూ ఇచ్చాడు ఆయన.

వెంకట రమణ ఫోన్ తీసుకుని నెంబరు డయల్ చెయ్య బోయాడు. కాని నెంబరు గుర్తుకి రాలేదు. ఆ నెంబరు కాదు ఎ నంబరు గుర్తుకి రాలేదు. 'తీసుకోండి' అంటూ తిరిగి ఇచ్చేసాడు.

'ఏమయింది' అడిగాడు ఆ వ్యక్తి.

'నెంబరు గుర్తుకి రావడం లేదు' అన్నాడు.

'అవునండి బాబు. ఈ సెల్ ఫోన్ వచ్చాకా మన మెమొరీ దొబ్బింది. దీని మెమొరీ మీదే బతుకుతున్నాం.' అంటూ వెళ్లి పోయాడు.

'ఛ ఒక్క నెంబరు గుర్తుకి రావడం లేదు. మెమొరీ దొబ్బింది. ఛీ .. సెల్ ఫోన్ లోపలి ఎలో చేస్తే వీళ్ళ సొమ్మేం పోయింది. జరగాల్సింది ఎలాగూ జరుగుతుంది. సెల్ ఫోన్ ఆపేస్తే ఆగుతుందా...ఛ వెధవ బ్రయిన్ ..నెంబరు గుర్తుకి రానందుకు తనని తానే తిట్టుకున్నాడు వెంకట రమణ.

అలివేలు కోసం వెతుకు తున్నాడు.

అలా వెళుతూ ఒక చోట చూసాడు. ఒక పిచ్చిది కూర్చుని వుంది. చేతిలో పిల్లాడు వున్నాడు. వెంకటేశం వయసే వుంటుంది.

ఏడుస్తున్నాడు. ఆ పిచ్చి దానికి కోపం వచ్చింది. ఏడవరా.... ఏడూ.. మనం ఏడుకొండలకి వచ్చింది ఏడవ డానికే. అసలు ఇదంతా నీ వల్లె వచ్చింది'. అంటూ వాడిని బాదుతోంది.

వెంకట రమణ కి జాలేసింది. 'ఎందుకమ్మా వాడిని అలా కొడతావు.    ఎం చేసాడు' అంటూ అడిగాడు.

ఆ పిచ్చిది    వెంకట రమణ వంక చూసి    ఒక్కసారి బావురు మంది. వెంకట రమణ కూడా ఆ పిచ్చిదాన్ని చూసి అలివేలు...అంటూ    బావురు మన్నాడు. అలా ముగ్గురూ ఒకళ్ళని పట్టుకుని ఒకళ్ళు    ఏడ్చారు.

'ఏవండీ ఇక్కడ మనం ఒక్క క్షణం కూడా ఉండద్దు.    ఈయన ఆపద మొక్కులు వాడు అంటే    ఆపదలు తొలగిస్తాడు అనుకున్నాను గాని    వస్తే ఇంత    ఏడిపిస్తా డనుకోలేదు    పదండి పోదాం. ఇంకెప్పుడూ రావద్దు. అంటూ ఏడ్చింది.

'.    మనం రాకపోవడమే కాదు    అలివేలు ఇంకెవర్నీ కూడా రాకుండా చెయ్యాలి.' అన్నాడు వెంకట రమణ.

'మనం అంటే మానేస్తాం.    ఎవర్నీ రాకుండా ఎలా చేస్తాం.' అంది అలివేలు.

' అలివేలు ఈ    గార్డులు, పూజారులు, పంతుళ్ళు, చానల్ వాళ్ళు, పానల్ వాళ్ళు ఆ స్వామికి మనం ఇచ్చే మొక్కుల మీద ఆధార పడి బతుకుతున్నారు.    అలాంటి    భక్తులకి విలువియ్యని ఇలాంటి వాళ్ళు ఉన్నంత కాలం మనం రావద్దు. ఎవర్నీ రానియ్యద్దు .    మన మొక్కులు ఆగి పోతే గాని వీళ్ళకి తెలిసి రాదు పద'    అంటూ    అలివేలుతో    వెళ్ళాడు .

అలా వెళ్ళిన వెంకట రమణ    కడుపు మండి తనకున్న పాండిత్యంతో    తను అనుభవాన్ని కళ్ళకు కట్టి నట్టు 'భక్తి – విరక్తి' అని    ఓ కధ రాసి పత్రికకి పంపాడు.

అది చదివిన ప్రతీ వాడు    ఇది నిజంగా    తిరుపతి వెళ్ళిన ప్రతీ వాడి అనుభవమే అంటూ    తమ వ్యధ కధలో ప్రతి బింబించినందుకు    వెంకట రమణ ఎడ్రస్ తీసుకుని,    ఫోన్ నంబరు తీసుకుని    అభినందించారు.    అంతే కాకుండా ఆ కధని    తమిళ్, కన్నడ, మలయాళం , హిందీ, బెంగాలి ,    ఇంగ్లిష్    భాష లలోకి    అనువదించి    ప్రచురించారు. దాంతో వెంకట రమణ    పేరు మారు మోగి పోయింది.

'అదీ జరిగింది'    అన్నాడు శ్రీనివాసుడు

'అంటే ఇదంతా ఆ వెంకట రమణ    చేసిన పనా . అంది కోపంగా లక్ష్మీ దేవి.

'నేనా' అన్నాడు శ్రీనివాసుడు

‘మీరు కాదు భూ లోకం లో మీ పేరు పెట్టుకుని కధ రాసిన ఆ వెంకట రమణ. ఆ కధ వల్లే గా మన కధ ఇలా మారింది.’ అంది లక్ష్మీ దేవి.

‘నారాయణ…నారాయణ .. నిజం చెప్పావు తల్లీ, అంటూ నారదుడు వచ్చాడు.

‘ నారదా సమయానికి వచ్చావు .. భూ లోకంలో మా సంగతి తెలుసుగా , ఇలా జరగడానికి కారణమయిన ఆ వెంకట రమణకి తిరుగు లేని శాపం పెట్టాలి ’ అంది లక్ష్మీదేవి.

‘ఆఆ . తల్లీ నువ్విచ్చె శాపం కలికాల కాల మాన ప్రకారం వాడికి తగిలే సరికి వాడి ఆయువు తీరిపోతుంది. అయినా ఇందులో ఆ మానవుడి తప్పే ముంది. తమ దర్శనం చేసు కోవాలని ఎంతో భక్తిగా ఇంట్లో పూజ కూడా చేసుకుని బయలు దేరాడు. కాని మనకి మానవునికి మధ్యలో వున్న సంధాన కర్తలు చేసిన పనికి వాడికి కాలింది. మనమా వాళ్ళకి కనిపించం. వాడు మాత్రం ఎం చేస్తాడు’ . అన్నాడు నారదుడు వస్తూ.

‘అవును నారదా నిజం చెప్పావు ‘ అన్నాడు శ్రీనివాసుడు

‘మీరిలా భక్తుల్ని వెనకేసుకు రాబట్టే వాళ్ళు అలా తయారయ్యారు’ అంది లక్ష్మి

‘భూ లోకం లో నరులు నారాయణుని పేరు అడ్డు పెట్టుకుని నానా విధాలుగా భక్తులని ఏడిపిస్తూ, నానా విధాలుగా ప్రవర్తిస్తూ, నానా విధాలుగా నారాయణుని ఆస్తి ని అనుభవిస్తున్నారు. నారాయణ..నారాయణ..’ అన్నాడు నారదుడు.

‘అలా ఎందుకు జరుగు తోంది స్వామి’ అడుగింది లక్ష్మీదేవి

'స్వామి వారి జాతకం . సరిగ్గా లేదు. ఓసారి చూపించు కుంటే బాగుంటుంది.' అన్నాడు నారదుడు.

'నా జాతకానికి ఏమయింది. బ్రహ్మాండంగా వుంది.' అన్నాడు శ్రీనివాసుడు.

'జాతకం బ్రహ్మాండంగానే వుంది. మీరే బాగోలేరు.' అన్నాడు నారదుడు.

'అవును. ఒక్కసారి మీ నాన్న గారికి చెప్పి అసలు లోపం ఎక్కడుందో కనుక్కో నారదా.' అంది లక్ష్మి దేవి.

'అమ్మా... ఈ మాత్రం దానికి నాన్న గారెందుకు. నేనే చెబుతాను. నరులైనా , నారాయణులయినా జాతకాలు గ్రహాల అనుగ్రహం మీద నడుస్తాయి. ఇది నా లెక్క ప్రకారం స్వామి వారికి ఏలినాటి శని నడుస్తున్నట్టుంది. దాని ప్రభావమే ఇది..' అన్నాడు నారదుడు.

'నాకు శని ప్రభావమా ' అన్నాడు శ్రీనివాసుడు

'కాదా మరి. సాక్షాత్ ఆ ఈశ్వరుడినే వదల లేదు శనీశ్వరుడు వేంకటేశ్వరుడు మీరొక లెక్కా..'అన్నాడు నారదుడు.

'అంటే ఇప్పుడు నా స్వామిని శనీశ్వరుడు పట్టుకున్నాడా.' అడిగింది లక్ష్మీ దేవి.

' కాదామరి ఇంత వరకు ప్రశాంతంగా దర్శనాలు ఇస్తూ ఆ భక్తుల కోర్కెలు తీర్చే స్వామికి మీడియా పిచ్చి పట్టించినది ఎవరు. శనేశ్వరుడు కాదు. చానల్, బోర్డు పానల్, ఆర్జిత సేవలు, వి.ఐ.పి. బ్రేక్ దర్శనాలు. చిన్న కల్యాణం, పెద్ద కల్యాణం, దళారులు . అసలు నాకు తెలిక అడుగుతాను. స్వామి వారికి చానల్ అవసరమా .. దానికి ఎంత ఖర్చు .. దానిమీద మనకి ఖర్చు ఎంత. ఆదాయం ఎంత. దాని పేరు చెప్పి మన మధ్యలో వున్న సంధాన కర్తలు తినేది ఎంత ఇవేమీ తెలుసుకోకుండా చానల్ పెట్టారు. ఆ దెబ్బకి హుండీ కి గండి పడింది

.

చానల్ సంగతి అలా వుంటే బోర్డు పానల్ లో అధికారుల మధ్య కుమ్ములాట. వి.ఐ.పి. లు ఎవరికి మానవులకా? స్వామికా ? దేవుడి దృష్టిలో భక్తులంతా సమానం అంటూ స్పెషల్ దర్శనం, శీఘ్ర దర్శనం, వి.ఐ.పి.బ్రేక్ దర్శనాలు

పెట్టి డబ్బులు గుంజుతూ ఇష్టపడి, కష్టపడి కాలినడకన వచ్చే భక్తులకి, డబ్బులు లేక ఉచిత దర్శనం లైనులో నుంచునే వారిని గంటలు, రోజులు లైనులలో పెట్టి , వాళ్ళకి వెంటనే దర్శన భాగ్యం కలగ చేస్తున్నారు. దాంతో నిజంగా భక్తితో వచ్చే భక్తులకు దేవుడంటేనే విరక్తి కలిగింది. క్లాస్ వాళ్లకి ఓ దర్శనం, మాస్ వాళ్లకి ఓ దర్శనం. తమ మొక్కులు తీరితే నిలువు దోపిడీ ఇచ్చే వాళ్ళు మాస్ భక్తుల్లో వున్నారు. క్లాస్ భక్తుల్లో ఎ ఒక్కడయినా ఎప్పుడయినా నిలువు దోపిడీ ఇచ్చాడా.

ఇలా ప్రతీ చోట ఏవో లోపాలు ఇవన్నీ శని ప్రభావం కాదా.

'అవును నారదా.. ఆలోచిస్తూంటే .. ఇదంతా నిజమేమో అనిపిస్తూంది.' అన్నాడు శ్రీనివాసుడు.

'నిజమేమో కాదు స్వామి.. పచ్చి నిజం. గడిచిని యుగాల్లో అవతారాలు ఎత్తడం కాదు, ఈ కలి యుగం లో మనిషి అవతారం ఎత్తి మీ దర్సనం మీరే చేసుకోండి. మీ మీద మీకే విరక్తి కలుగుతుంది. ' అన్నాడు నారదుడు.

శ్రినివాసుడు కళ్ళు మూసుకుని ఆలోచనలో పడ్డాడు.

'ఇంకా ఎన్నాళ్ళు ఈ బాధ మాకు స్వామి ' అని అడిగింది లక్ష్మి.

'స్వామి కళ్ళు తెరిచే వరకు' అన్నాడు నారదుడు.

'అంటే' అంది లక్ష్మీదేవి

'అమ్మా.. స్వామి వారు వారానికోసారి నేత్ర దర్శనం అంటూ కళ్ళు తెరిచి లోకాన్ని చూస్తున్నారు. మిగిలిన రోజులు స్వామి వారి నేత్రాలని నామం కప్పేస్తోంది. స్వామి చూడటం లేదని ఆ నామం పేరుతో స్వామి వారికి పంగ నామం పెడుతున్నారు. స్వామి వారు కళ్ళు పూర్తిగా తెరిచి అలాంటి వాళ్ళ పని పడితే గాని స్వామి వారికి పూర్వ వైభవం రాదు.

ఇప్పటికే పోవాల్సినదంతా పోయింది.మిగిలినది దక్కించు కుంటే బాగుంటుంది ’ అంటూ చెప్పాడు నారదుడు.

కళ్ళు మూసుకుని వింటున్న శ్రీనివాసుడు కళ్ళు తెరిచాడు. కోపం గా కళ్ళు ఎర్రగా వున్నాయి. ఎదురుగా శనీశ్వరుడు వచ్చాడు.

‘ స్వామీ. నా పని అయిపోయింది. నేను మిమ్మల్ని వదులు తున్నాను. ఇక అసలు వాళ్ళ పని పడతాను.’ అంటూ వెళ్లి పోయాడు.

స్వామి ప్రశాంతంగా కళ్ళు మూసుకున్నాడు.

తిరుపతి దేవస్థానానికి తిరుపతి రావని ఐ.ఎ.ఎస్. ఆఫీసరుని చైర్మన్ గా వచ్చాడు. ఫలితం. దేవుడి మాన్యాలు కాజేసిన వాళ్ళ ఇంటి మీద రైడింగులు, అవినీతి ఉద్యోగుల భాగోతం బట్ట బయలు, ఉద్యోగుల తొలిగింపు.

అప్పుడు గాని దేవస్థానం బోర్డు కి అర్ధం కాలేదు. తాము చేసిన తప్పు ఏమిటో. తాము ఎవరి మీద, ఎవరి దయా దాక్షిణ్యం మీద బతుకు తున్నామో. ఎవరి నయితే వాళ్ళు పశువులకన్నా హీనంగా చూసారో వాళ్ళు రావడం మానేస్తే ఏమవుతుందో. వాళ్ళల్లో భక్తి తగ్గితే తమకి భుక్తి గడవదన్న నిజం తెలుసుకుంది.

నీతి పరులయిన అధికారులతో కొత్త బోర్డు సమావేశమయింది.

బోర్డులో ముందుగా తీసుకున్న నిర్ణయం. అన్ని దర్శనాలు రద్దు. అందరికీ ఒకే ఒక దర్శనం అది సర్వదర్శనం. ఎవడు ఎంత గొప్ప వాడయినా దేవుడి ముందు సమానమే. దేవుడి ముందు పేద. గొప్ప బేధాలు లేవు. అందరూ ఒకే లైనులో రావాల్సిందే.

కంపార్టు మెంటులలో కూడా ముందు వచ్చిన వాడు ముందే వెళ్లేటట్టు తోపులాటలు లేకుండా ఏర్పాట్లు .

వెండి వాకిలి, బంగారు వాకిలి, ఆనంద నిలయాల వద్ద తోసుకునే మూడు లైనులు లేకుండా ఒకే ఒక లైను.

లైనులో నిలబడ్డ వారికి తాము టివి ల ద్వారా ఎక్కడ వున్నారో తెలిపే ఏర్పాట్లు చెయ్యడం.

పోటు వాళ్ళకి జీతాలు పెంచి వాటా రద్దు.

ప్రజలకి గాని దేవుడికి గాని ప్రయోజనం లేని చానల్ మూసివేత .

ఇలాంటి మంచి నిర్ణయాలతో కొత్త బోర్డు పుట్టింది.

ఇప్పుడు శ్రీనివాసుడు ప్రజలకి ప్రశాంతంగా దర్శనం ఇస్తూ, కుబేరుడికి వడ్డీ కడుతూ సుఖంగా వున్నాడు.

అలాగే భక్తులు కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా ముడుపులు చెల్లించు కుంటూ స్వామి వారిని దర్శించుని వెళుతున్నారు.

ఇంత కథ నడిపించిన వెంకట రమణ ఇప్పుడు బోర్డులో గౌరవ మెంబరు.

సర్వేజనా సుఖినో భవంతు.




'కస్తూరిబా సేవాశ్రమం'

ఆటో దిగిన రాఘవ ఆటో అతనికి డబ్బులిచ్చి ఆశ్రమంవైపు అడుగులేశాడు.

రంగులు వెలిసిపోయిన బోర్డుని చూసి నిట్టూర్చి. జీర్ణావస్థలో వుండి తుప్పుపట్టి నేడో రేపో అన్నట్టుగా వున్న గేటుని చిన్నగా తొలగించుకుని లోపలికి అడుగుపెట్టాడు. గేటు నుండి ఆశ్రమందాకా అటూ ఇటూ ఏటవాలుగా అమర్చిన ఇటుకలతో కాలిబాట కూర్చబడి వుంది.

రెండు వైపులా కొన్ని పూలమొక్కలు మరికొన్ని ఫలాల చెట్లూ వున్నాయి. ఆ ప్రాంతాన్ని చూసే దిక్కు లేదన్నట్టుగా చాలా వరకు పిచ్చిమొక్కలూ ఆక్రమించుకుని వున్నాయి. ఆ పరిసరాలు ఊడ్చి కూడా చాలా కాలమైనట్టు చెత్తా చెదారంతో నిండి వున్నాయి.

మూసి వున్న ఆశ్రమపు తలుపుని ఓ పది సార్లు బాదిన తర్వాత సన్నగా వున్న అరవైయేళ్ళాయన తలుపు తీసి ఏమిటన్నట్టుగా విసుగ్గా చూశాడు."మీ ఆశ్రమంలో వున్న సీతారామయ్య జానకి దంపతులని చూడాలని వచ్చాను. దయచేసి పిలుస్తారా?"అన్నాడు.

ఆయన ఏమీ మాట్లాడకుండా లోపలికి వెళ్ళాడు.రాఘవ నిలబడలేక కొద్దిదూరంలో మూడు కాళ్ళతో వున్న స్టూలు మీద కూర్చున్నాడు.ఇరవైనిముషాలు అయింతర్వాత నెమ్మదిగా వచ్చారు ఆ దంపతులిద్దరూ. చిక్కి శల్యమైపోయి జీవచ్ఛవాళ్ళావున్నారు.

వాళ్ళిద్దరినీ చూశాక కన్నీళ్ళతో మసక బారాయి రాఘవ కళ్ళు. వాళ్ళు బాగా దగ్గరికి వచ్చి రాఘవని చూశాక కోపపు ఛాయలు వాళ్ళ ముఖాల్లో స్పష్టంగా కనిపించాయి.'నువ్వని తెలియక అనవసరంగా వచ్చాము. నీతో మేము కలిసి మాట్లాడవలసిన అవసరము లేదు' అన్నట్టుగా వెనుదిరిగారు."ఆగరా సీతారామం, ఎందుకురా అంత ద్వేషం? నేను తప్పు చేశాను నిజమే కాని ద్వేషించే తత్వం నీది కాదుకదరా."

"నీమీద కోపంవచ్చిన మాట వాస్తవమే..కాని వెనుదిరగడానికి మాత్రం మా ఇద్దరి ఈ దిక్కుమాలిన అవస్థని నీ ముందు పరచడం ఇష్టంలేక"అన్నాడు బాధగా.

వాళ్ళిద్దరినీ అలాచూస్తుంటే రాఘవకి గతం గుర్తుకొచ్చింది. అసలు మర్చిపోతేగా..

అప్పుడు గాంధీనగర్లోని ఒక చిన్న ప్రైవేటు సంస్థలో పనిచేస్తుండేవారు రాఘవ, సీతారామయ్య***, శ్రీనివాసు, సుబ్బయ్య.నలుగురూ ప్రాణ స్నేహితుల్లా కలసి మెలసి వుండేవారు. ఏది చేసినా కలసి చేసే వారు. వాళ్ళ కుటుంబాలు కూడా కలసి పోవడంతో వుండడానికి కొద్ది దూరంలో వుంటున్నా ఉమ్మడికుటుంబపు బాంధవ్యం వాళ్ళ మధ్య చోటు చేసుకుంది.

అర కొర జీతాలు. అయినా ఒకళ్ళకొకళ్ళకి సాయం చేసుకుంటూరు. అందువల్ల కష్టాలు వాళ్ళకి కాస్త దూరంగానే వుండేవి. జీవితంలో ఎక్కువగా డక్కామొక్కీలు తిని వుండడం వల్ల అందరిలోకి కాస్త ఎక్కువ లోకజ్ఞానం కలిగిన వాడు రాఘవే! అందుకే చాలా విషయాల్లో ఆర్థికంగా చేతులుకాలడానికి ముందే స్నేహితులని హెచ్చరిస్తుండే వాడు. దాంతో అతనంటే వాళ్ళకి గొప్ప నమ్మకం అభిమానం ఏర్పడ్డాయి.

పిల్లల్ని పెంచి పెద్ద చేయడం..చదివించడం తప్పని సరిగా ప్రతివాళ్ళూ చేయాలసిందే! కాని తల్లిదండ్రులు రేపటి తమ భవిష్యత్తుని కూడా దృష్టిలో వుంచుకోవాలి. అందుకు కావాలసిన ఆర్థిక ప్రణాళికలు కూడా రెక్కాడుతున్నప్పుడే వేసుకోవాలి. అదే

స్నేహితులతో చెప్పేవాడు. కాని అసలే జీతాలు తక్కువ..పైగా ఏ నెల కా నెలగా వుండేది. అందుచేత ఆ విషయంలో మాత్రం డబ్బు తమకోసం దాచుకునే వారు కాదు.

ఒకరోజు స్నేహితులందర్నీ సమావేశ పరచిన రాఘవ 'ఒరే మనం ఏది చేసినా కలసి మెలసి చేశాము. ఇప్పుడు నేను చెప్పేది జాగ్రత్తగా వినండి. మన ఊరి శివార్లలో ప్లాట్లు వేస్తున్నారట. దానికి మనం డబ్బు నెలె నెల కట్టచ్చుట. మన పేరుమీద స్థలమూ వుంటుంది. మనందరం భవిష్యత్తులో ఇల్లు కట్టుకుని ఎప్పటికి అక్కడ కలసివుండచ్చు.

మన స్నేహం శాశ్వతమవుతుంది. అందరం తీసుకుంటాము కాబట్టి తక్కువకే మాట్లాడాను. మీరు ఊ అనాల్సిందే!" అన్నాడు.రాఘవ ఎంతో బలవంతం చేసిన మీదట "సరే కాని డబ్బు నెల నెలా నీ చేతికే ఇస్తాం. నువ్వే అవన్నీ చూసుకో. "అన్నారు.స్నేహితులు ఒప్పుకున్న ఆనందంలో "సరే" అన్నాడు.సంవత్సరాలు గిర్రున తిరిగాయి.పిల్లలు అడ్డాల నుండి గడ్డాలదాకా ఎదిగారు.

రెక్కలొచ్చాయి ప్రపంచం వాళ్ళకి అందంగా కనిపించసాగింది. ఆడపిల్లల పెళ్ళిళ్లకి..మొగపిల్లల చదువులకీ డబ్బు కావలసి వచ్చింది. ఆ భారం మోయలేనిది. ఆస్థులు లేవు అమ్ముకోడానికి. అంతంత అప్పులూ పుట్టవు. సరిగ్గా అక్కడ ఆగిపోయారు.

ఆలోచించగా..ఆలోచించగా వాళ్ళకి రాఘవ తమచేత స్థలం కొనిపించడం గుర్తుకొచ్చింది. కాని రాఘవ మీద నమ్మకంతో డబ్బు ఇవ్వడంతప్ప ఆ స్థలం గురించి ఏమీ తెలియదు. ఎక్కడుందో కూడా తెలియదు. ఒకసారి మిత్రులంతా కలసి వెళ్ళి రాఘవని అడిగారు.

"ఏ స్థలం?" నింపాదిగా అడిగాడు.

"అదేంట్రా నెల నెల జీతంరాగానే ఠంచనుగా డబ్బు తీసుకునే వాడివి ఇప్పుడు ఏస్థలమంటావేమిటి?"అడిగారు.

"నెల నెల మీ సంపాదన మీరు తినడానికి.. వుండడానికే సరిపోదు పైగా స్థలం కొనడానికి డబ్బు ఇచ్చారా?"అన్నాడు వ్యంగ్యంగా."అవునంకుల్ మీరు అప్పడప్పుడు ఇంటికొచ్చికూడా డబ్బు తీసుకెళ్ళేవారు"అన్నారు గడ్డాలొచ్చి రక్తం ఉరకలెత్తుతున్న పిల్లలు.

"ఇది అన్యాయంరా నిన్ను నమ్మాం. నిన్ను నిలదీయడానికి మా దగ్గర ఆధారాలేమీ లేవు. కానీ దేవుడున్నాడ్రా."అన్నారు బాధగా.ఆ తర్వాత కొంత కాలానికి రాఘవ చెప్పా పెట్టకుండా ఆ ఊరు వదలి వెళ్ళిపోయాడు.ముగ్గురు స్నేహితులు రాఘవని తల్చుకుని దుమ్మెత్తిపోశారు.

దాదాపు పన్నెండేళ్ళ తర్వాత మళ్ళీ ఇంత కాలానికి ఇప్పుడు..ఇలా..

"మీరేంట్రా ఇలా అనాధల్లా.." కళ్ళ నీళ్ళతో బాధగా అడిగాడు రాఘవ.

"నీలాగానే పిల్లలు కూడా మోసంచేశార్రా..ఒకరోజు మమ్మల్ని పెట్టే బేడా సర్దుకోమన్నారు..మేము మమ్మల్ని తీర్థయాత్రలకి తీసుకెళ్తారేమో అనుకున్నాం..కాని..కాని..ఇక్కడ దింపి..మళ్ళీ జీవితంలో తమకు కనిపించొద్దని చెప్పి వెళ్ళిపోయార్రా.

.ఉన్నట్టుండి అనాధలమైపోయాం..నువ్వు చెప్పింది నిజమేరా..పిల్లల్ని పెంచడంతో పాటు మన భవిష్యత్తు గురించి కూడా ఆలోచించుకోవాల్రా.."అంటూ బావురుమన్నాడు.

"ఇలా జరుగుతుందని ముందే ఊహించాను. అందుకే ఆ స్థలాన్ని మీ పేరున భద్రపరిచాను. 'మీరు ఎక్కడుంటున్నారు..ఏంచేస్తున్నారు..ఎలా అన్యాయమైపోతున్నారు' అన్నీ తెలుసుకుంటుంటుండే వాడిని. నా దగ్గరికి స్థలం కోసం వచ్చినప్పుడు మీ స్థలం మీకు అప్పగిస్తే ఏం జరిగేది?

దాన్ని అమ్మి మీ పిల్లలకి మరింత అందమైన భవిష్యత్తునిచ్చేవారు అంతేగా. ఇంక ఏడ్వద్దు..పదండి..మీ పేరున అప్పుడు కొన్న స్థలంలో కొంత అమ్మి మీకు చక్కటి ఇల్లు కట్టించాను. మిగిలిన డబ్బు బ్యాంకులో కూడా వేశాను. దానిమీద వచ్చే వడ్డీతో హాయిగా వృద్ధాప్యాన్ని వెళ్ళదీయవచ్చు."అన్నాడు.

‘తమకోసం ఇంతగా ఆలోచించిన రాఘువనా అనుమానించినది? వాడిదెంత ముందు చూపు? పిల్లల కోసం సమస్తం కోల్పోతామని తమకోసం ఎంత జాగ్రత్తపడ్డాడు. రోడ్డుమీద పడిన తమకి మళ్ళీ పూర్వవైభవం తెస్తున్నాడు.’ ఆపుదామనుకున్నా కన్నీళ్ళాగడంలేదు ఆ దంపతులకి.

వాళ్ళని ఆటోలో వాళ్ళ ఇంటికి తీసుకెళ్ళాడు.

అప్పటికే అక్కడ సీతారామయ్య, శ్రీనివాసు, సుబ్బయ్య వున్నారు వీళ్ళకోసం ఎదురుచూస్తూ."ఒరే! మనకి నిజమైన స్నేహితుడంటే రాఘువేరా..అలాంటి వాళ్ళేరా స్నేహానికి అసలు సిసలైన అర్థం. పిల్లలకోసం..మనం సమస్తం ధారపోస్తే..దానికి వాళ్ళు మనపట్ల చూపే కృతజ్ఞత నిరాదరణ.

అందుకే పెంచడం..వృద్ధిలోకి తీసుకురావడం మన బాధ్యత కాబట్టి చేయడం తప్పుకాదు..కాని రేపు వాళ్ళు మనకి ఆసరా అవుతారనుకోకూడదు. మన జాగ్రత్తలో మనముండాలి. అందరికీ రాఘువలాంటి స్నేహితుడు వుండడుగా. ఏ తల్లిదండ్రుల చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం. చివరాఖరికి పిల్లల నిరాదరణకి గురికావడమేనన్నది మీ అందర్నీ ఇక్కడ చూశాక అర్థమైంది.

మనందరికీ వాడన్నట్టుగానే పక్క పక్కనే ఇళ్ళు కట్టించి..మన స్నేహాన్ని శాశ్వతం చేశాడు. ఇప్పుడు నాకు వృద్ధాప్యం శాపం అనిపించడంలేదు వరమనిపిస్తోంది." అన్నాడు శ్రీనివాసు."సర్లే..సర్లే..బాధ్యతలతో ఇప్పటిదాకా మీరు సుఖపడింది లేదు..పిల్లలు మిమ్మల్ని వదిలించుకున్నారు కాబట్టి ఇహనుండైనా మీక్కావలసినట్టుగా వుండండి. ఆనందంగా వుండండి"అన్నాడు రాఘువ.

"మాదో కోరికరా రాఘవా! మా తదనంతరం ఈ ఇళ్ళని మా పిల్లలకి మాత్రం ఇవ్వద్దు..మాలాంటి అనాథ దంపతులకి ఆవాసయోగ్యం చెయ్యి చాలు"అన్నారు ముక్తకంఠంతో భారంగా.




కృష్ణమూర్తికి కోపం వచ్చింది. తన మీద, సభ్య సమాజం పైన. పెళ్లి వయసు వచ్చిన మొగ పిల్లల తల్లితండ్రుల పైన. రోజూ భార్య ఇచ్చే కాఫిని మెచ్చుకునే అతను,'వేడి లేదు','చెక్కర లేదు' అంటూ విసుక్కున్నాడు.

దీని కల్లా కారణం ఏమిటంటే అతను వాళ్ళ ఒక్కగానొక్క అమ్మాయికి పెళ్లి సంబంధాలు చూస్తున్నాడు. జాతకాలు,నక్షత్రాలు నమ్మకూడదు 'ట్రాప్'అంటాడు.ఈ ప్రయత్నంలో అతను ఎవరైనా వివాహ వేదికలు గట్రా నిర్వహిస్తుంటే వెళ్ళడం నేర్చుకున్నాడు. దానికి ప్రత్యేకంగా ఆదివారం కేటాయించాడు. అతను అంత త్వరపడటానికి కారణం: రెండు సంవత్సరాలలో పదవీ విరమణ చేస్తాడు. ఈ లోపుగా పదవి ద్వారా వచ్చిన పరపతిని ఉపయోగించి అమ్మాయి పెళ్లి చేద్దామని ప్రయత్నం. 'మాట్రిమోనీ కాలంలో' రిజిస్టర్ చేశాడు.

ప్రతీ శనివారం ఇంటర్ నెట్ లో, వేరు వేరుమాట్రిమోని సైట్లలో మొగ పిల్లలప్రొఫైల్స్ చూడడం, నచ్చిన వాళ్లను షార్ట్ లిస్టు చెయ్యడం లాంటివి చేస్తూ, ఇచ్చిన వివరాల ప్రకారం తల్లితండ్రులుతో మాట్లాడడం మొదలు పెట్టాడు. మొదట్లో అందరూ వివరాలు తీసుకొని జాతకాలు ఒప్పలేదని, నక్షత్రాల కంపాటబిలిటీ తక్కువగా ఉందని, అమ్మాయి నాజూగ్గా లేదని, ఛాయ తక్కువఅంటూ రకరకాల కారణాలు చెప్పసాగారు. మూర్తిగారు అమ్మాయి కుందనపు బొమ్మ అని అందరూ అంటుంటే చాలా గర్వంగా ఉండేది. ఇప్పుడు ఇలా అంటున్నారేమిటిఅని బెంగ పెట్టుకోసాగాడు. తెలిసిన ప్రతిఒక్కరికీఎమన్నా సంబంధం ఉంటే చెప్పండి అనితరచితరచి అడగడం మొదలు పెట్టాడు. అంతవరకు వరకు పెళ్ళికి రమ్మని ఎవరు పిలిచినా, ఎదో కారణాల వాళ్ళ వెళ్ళనివాడు,ఇపుడు ఎవరైనా పెళ్ళికి పిలుస్తే, భార్యని, పిల్లని బలవంతం పెట్టి తీసుకు వెళ్లసాగాడు. పెళ్ళిలలో పలకరింపులయ్యాక, ఉన్న అబ్బాయిల గురుంచి వాకబు చెయ్యసాగాడు. ఎన్ని చేసినా ఫలితం కనిపించలేదు.

ఒకరోజు పొద్దునే కృష్ణమూర్తి వేలు విడిచిన మేనమామ ఫోన్ చేసి, పిచ్చాపాటి మాట్లాడిన తర్వాత ఆయనకు తెలిసిన ప్రొఫెసర్ ఉనట్టు, అతనికి ఒక కొడుకు ఉన్నాడని అతనికి పెళ్లి చేస్తారంటూ వాళ్ళ ఫోన్ నెంబర్ ఇచ్చారు. ఆఖరుగా ప్రొఫెసర్ గారు కొంచెం చాదస్తం అని, జాగ్రత్తగా మాట్లాడమంటూ ఉచిత సలహా ఇచ్చారు. ఆ రోజు సెలవు కావడంవల్ల, కృష్ణమూర్తి టిఫిన్, కాఫీ అయ్యాక తీరికగా ప్రొఫెసర్ గారితో మాట్లాడాలని నిశ్చయించుకున్నాడు.

పొద్దున ఎనిమిది గంటల తర్వాత ప్రొఫెసర్ గారెకి ఫోన్ చేసాడు. అవతల నుండి గట్టి మూలుగు లా వినపడింది. ఏమో తోచక ఫోన్ పెట్టేసి, మల్ల ఫోన్ చేశాడు. అవతలి నుండి “అయ్యా, రెండు రోజులనుండి దగ్గుగా ఉంది, మీకే మీ పని లేకపోతే దయచేసి ఫోన్ పెట్టేయండి, లేదా ఏమికావాలో చెప్పండి”అంటూ బొంగురు గొంతుతో అవతలనుండివిన్న పడ్డది. కృష్ణమూర్తి తమాయించుకొని తనని పరిచయం చేసుకొని అమ్మాయి వివరాలు చెప్పాడు. అన్నీ తీరికగా విన్న ప్రొఫెసర్ గారు, మెల్లగా అన్ని వివరాలు మళ్ళీ మళ్ళీ అడుగుతూ, అమ్మాయి సంగతి అటు ఉంచి కృష్ణమూర్తి గురించి వివరాలు అడగడం మొదలు పెట్టాడు. జీతం గురించి, ప్రతీ ఏడాది వచ్చే ఇంక్రిమెంట్ గురించి, ఆస్తిపాస్తుల గురించి, కొన్న కార్ గురించి అడుగుతుంటే కృష్ణమూర్తికి అనుమానం వేసి, ఆయనను అడిగాడు. ఆయన “అబ్బా అదేమీ లేదు , మీరు మాకు సరితుగాగలరా లేదా అని వివరాలు అడుగుతున్నా”అని చల్లగా చెప్పారు ప్రొఫెసర్ గారు. కృష్ణమూర్తి ఖంగు తిన్నాడు, ఇంతకుముందు ఎవరూ ఇలా అడగలేదు.

మళ్ళీ ప్రొఫెసర్ గారు ‘మీ వాళ్ళు ఎవరైనా మా యూనివర్సిటీ లో ఉన్నారా లేదా పని చేశారా’అని అడిగారు. అమ్మాయి గురించి వాకబు చేస్తారుకాబోసుఅని వాళ్ళ బాబాయి తోడల్లుడు శర్మ గారి గురించి చెప్పాడు. అంతే !! ప్రొఫెసర్ గారు “వాడు మీ చుట్టమా? వాడి వల్లకదండీ నా ప్రమోషన్ రాకుండా పోయింది. అయినవాడు కదా అని పని మాలా ఇంటికి వెడితే, నేను ఆఫీస్ విషయాలు ఇంట్లో మాట్లాడనుఅని మర్యాద లేకుండా చెప్పాడా!! నాకు రావలసిన ప్రమోషన్ ని ‘ మెరిటోరియస్కాండిడేట్’అంటూవేరే అనామకుడుకిసిఫార్సు చేస్తాడా?” అంటూ వచ్చే దగ్గును ఆపుకుంటూ ఆవేశ పడిపోసాగాడు.

కృష్ణమూర్తికి ఏమిచెయ్యాలో తోచలేదు. అన్నీవింటూ ఊరుకున్నాడు.

కొంచెం సేపు అయ్యాక, ప్రొఫెసర్ వారు ఆవేశం తగ్గించుకుని, పిల్ల విషయాలు అడగడం మొదలు పెట్టారు. బ్రతుకు జీవుడా అనుకుంటూ , కృష్ణమూర్తి జాగ్రతగా సమాధానం ఇవ్వ సాగాడు. అమ్మాయి ఇంజనీరింగ్ అయిన తర్వాత ఇక్కడే మంచి కంపెనీలో పని చేస్తోందని చేపినప్పుడు, 'అబ్బే ...ఇక్కడ ఎంత పని చేసినా అమెరికా కంపెనీ లాగా కాదండీఅంటూ. అమ్మయినిఎమె. ఎస్ ఎందుకు చేయించలేదన్నారు ప్రొఫెసర్ వారు. ఎక్కువ కష్టపడకుండా కాంపస్ సెలక్షన్ ఉద్యోగం సాధించిన విషయం, భవిష్యత్తులో కల లాభాలు అన్ని వివరంగా కృష్ణమూర్తి చెప్పాడు.

అయితే అమ్మాయి ఎమె. ఎస్ కాదు కనుక పెళ్లి అయ్యాక అక్కడ ఉద్యోగ అవకాశాలు చాలా తక్కువ అన్నారు నిరుత్సాహంగా ప్రొఫెసర్ గారు. మా అబ్బాయికి పెళ్లి చేసుకున్న తర్వాత ఖర్చు ఎక్కువ అవుతుంది తప్ప వాడికి ఆదాయ రీత్యా ఏమీ ఉపయోగం లేదంటూ తేల్చేశారు. కృష్ణమూర్తికి ఏం మాట్లాడాలో తెలియలేదు. ఇంకొంచెం సమయం తర్వాత ప్రొఫెసర్ గారు ఇంతకీ మీకు అబ్బాయిలేన్తమందిఅని అడిగారు. దానికి కృష్ణమూర్తి సమాధానమిస్తూ అంతకు ముందు తనకు ఒక్కతే కూతురు అని చెప్పినట్లు గుర్తు చేశాడు,దానికి ప్రొఫెసర్ గారు మళ్ళీ మూలిగినట్లు అనిపించి కృష్ణమూర్తి అడిగేశాడు. ప్రొఫెసర్ గారు సమాధానమిస్తూ భలే వారే కనీసం ఒక బావమరిది లేకుండా ఎలాగండి బాబు!!. అంటూ వాపోయారు. బావమరిది ఉంటే ఏదైనాఅవసరమున్నా లేదా కష్ట కాలంలో ఆదుకోవడానికి పనికి వస్తారంటూ ...ఏ కోశాన్నా మీ సంబంధం మాకు అనుకూలంగా లేదు అనిఖరాఖండీగా చెప్పేసాడు.

కృష్ణమూర్తికి కళ్ళు తిరిగాయి.ఏమిటి ఈ మనిషి? తన వంశం పెరగడానికి ఒక మంచి సంప్రదాయమైన కుటుంబంనుండి వచ్చిన అమ్మాయి కావాలా? లేక పెళ్లి అయిన మరుక్షణంనుండి డబ్బుల పంట పండించే కోడలు కావాలా?అంటూమధనపడిపోయి"అయ్యా ప్రొఫెసర్ గారూ.ఇంత నీచంగా ఆలోచించే మీరు ఎంతోమంది విద్యార్ధుల భవితను గ్యారంటీగా చెడగొట్టి ఉంటారు. మీలాంటి వారు పిల్లలుతప్పుచేస్తునప్పుడు మందలించడం పోయి, వాళ్ళ కంటే దారుణంగా ఆలోచిస్తున్నారు. ఈ వయసులో నాకు ముచ్చటగా ఉన్నా, మా ఆవిడ ఇంకొక బిడ్డను కనడానికి ఇష్ట పడదు .మీ లాంటి వారితో సంబంధం కలుపుకుందామన్న నా అలోచనకు నన్ను నేనే తిట్టుకుంటున్నా...ఛి... ఛి..."అని చిదరించుకుంటూ ఫోన్ డిస్కనెక్ట్ చేసి కృష్ణమూర్తి ఆలోచనలో పడిపోయాడు.

"ఎక్కడికి వెళుతున్నాము మనము?కేవలం ఆడపిల్లను కన్నంత మాత్రాన ఆ తల్లితండ్రులు ఇంత మానసిక క్షోభ పడాలా? ఒక్క పిల్ల అయినా సరే తన భవిష్యతు బాగా చేయాలంటూ.మొదటి సంతానం తర్వాత ఆపరేషన్ చేయించుకున్న తల్లితండ్రులు ఇంత బాధ పడాలా? ఒక సంబంధం కలుపుకుంటునప్పుడు అమ్మాయి వాళ్ళ ఆచార వ్యవహారాలు, వగైరాలు చూస్తారు తప్ప వివాహ క్రతువు అన్న దాన్ని కేవలం వ్యాపార దృక్పథంతో చూసే తల్లి తండ్రులని ఏమనాలి? వాళ్లకు వత్తాసు పలికే పిల్లలనేమనాలి??" ఆలోచిస్తున్న కొద్దీ కృష్ణమూర్తి కోపం, అసహనం పెరిగిపోవడం మొదలయ్యింది.

తన వివాహం చేయడానికి తన తండ్రి పడుతున్న ఆత్రుత వగైరాలు చూసి వసుధ తండ్రి దగ్గరకు వచ్చి " అందరూ మీలాగా ఆలోచించరు డాడీ! మీరు నా వివాహానికి పడుతున్న ఆత్రుత, వాళ్ళు వేసే ప్రశ్నలకు మీరు పడుతున్న ఇబ్బంది నేను అర్థం చేసుకోగలను. కోడలి రాకను ఒక వ్యాపార దృష్టితో చూసే అత్తామామలతో నేను ఎలా ఇమడగలను అనుకున్నారు? మరేం ఫర్వాలేదు. నాకాన్నా వయస్సులో పెద్దవాళ్లుపెళ్ళికాకుండా ఉన్నారు. ఎప్పుడు ఏమిజరగాలో అప్పుడు అది జరుగుతుంది. మీరు ఇంతహైరానా పడవద్దు" అని సమాధాన పరుస్తున్న కూతురిని గర్వంగా చూస్తూ, ఇటుపైన అన్నీ సంబంధాలు కాకుండా కోడల్ని కూతుర్లా చూసుకునే అతమమాలని వెదకాలిఅని అనుకుంటూ కృష్ణమూర్తి మళ్ళీ ఆలోచనలో పడిపోయాడు, ఈసారి కోపంగా కాకుండా గంపెడు ఆశతో...!



www.gotelugu.com www.gotelugu.com www.gotelugu.com

తన చేతిలోకి వచ్చిన ఏ వస్తువునైనా జాగ్రత్తగా వాడడం బాబూరావు కి అలవాటు. పదేళ్ళ క్రితం పెళ్ళిలో అత్తవారు ఇచ్చిన వాచీని ఈరోజుకీ కొత్తగా ఉంచాడంటే అతడి వాడకం ఎలాంటిదో తెలుస్తుంది. అయిదేళ్ళ క్రితం కొన్న బైకూ, ఆఫీసు వాళ్ళిచ్చిన ల్యాప్ టాపూ... ఇవే కావు.... ఏ వస్తువైనా ... ఎన్నాళ్ళ తర్వాతైనా.... కొత్తదిగానే కనిపిస్తుంది అతడి దగ్గర.

అలాంటిది ఈ మధ్యనే కొన్న సామ్ సంగ్ గెలాక్సీ మొబైల్ ఫోన్ గురించి ప్రత్యేకంగా చెప్పాలా? దానిమీదున్న ప్లాస్టిక్ తొడుగుకూడ తియ్యకుండా, గీతలు పడకుండా నీటుగా వాడుతున్నాడు.

“డాడీ! కొత్త గేము వచ్చిందట. ఒక్కసారి ఇవ్వు డాడీ. ప్లీజ్ డాడి. గేము ఆడి ఇచ్చేస్తాను” కిరణ్ బ్రతిమలాడాడు.

”కావాలంటే వీడియో గేమ్సు షాపులో కెళ్ళి ఆడుకో. ఎంత కావాలో చెప్పు. డబ్బులిస్తాను” అన్నాడు తప్ప మొబైల్ ఇవ్వలేదు బాబూరావు. కిరణ్ అంటే బాబూరావు ఏకైక సంతానం.

“‘ ఒక్కసారి ఫోనిస్తే అమ్మకి కాల్ చేస్తాను. ఇవ్వండి” గోముగా అడిగిన శ్రీమతికి మతి పోగెట్టేలా చేసాడు.

“నా డార్లింగువి కదూ. మొబైల్ మాత్రం అడక్కు. ల్యాండ్ లైన్ నుండి చేసుకో!చాలా కాల్సు మిగిలి పోయాయి. ప్లీజ్’ సున్నితంగా ముద్దు ముద్దు మాటలతో చెప్పాడు తప్ప సెల్లివ్వలేదు. ఎవరిచేతిలోనైనా పొరపాటున చేయి జారిపడితే గీతలు పడి మొబైల్ అందం పాడవుతుందని అతగాడి భయం.

‘బాబూరావ్ ఒక్కసారి ఫోనివ్వు. నాది బ్యాటరీ డౌనయింది. అర్జెంట్ కాల్ చెయ్యాలి’ ఆఫీసులో పక్క సీటు పరశురామ్ అడిగాడు.

‘ఇదిగో రూపాయి. కోయిన్ బాక్సు దగ్గరికెళ్ళి చేసుకో. మొబైలు మాత్రం అడక్కు. సారీ” మారు ఆలోచించకుండా చెప్పాడు బాబూరావు. అంత జాగ్రత్తగా కాపాడుకొస్తున్నాడు మొబైల్ ని.

అర్జెంటుగా హెడ్డాఫీసుకి వెళ్ళి పని చూడమని ఆఫీసు వారు పంపిస్తే హైదరాబాదు వెళ్ళాడు బాబూరావు. అబిడ్స్ దగ్గర్లోని అతిథి రెసిడెన్సీ లో దిగాడు. నాంపల్లికి వెళ్ళే సిటీ బస్సెక్కినప్పుడు చేతివాటం చూపించాడు జేబు దొంగ. అతి భద్రంగా దాచుకున్న మొబైల్ పోయేసరికి బాబూరావు అనుభవించిన బాధ చెప్పలేము.

‘అప్పుడే పుట్టిన పిల్లాడిని చూసినంత మురిపెంగా ఎంతో అపురూపంగా చూసుకున్న మొబైలుని ఇప్పుడెవడో దొంగిలించాడు. దాన్ని కొట్టేసినవాడు తనలాగా వాడతాడా? ఖచ్చితంగా వాడుకోడు. సెకండ్ హేండు ఫోన్ కింద అమ్మేస్తాడు తప్ప సొంతానికి వాడుకోడు.” అనుకున్నాడు బాధగా. వెంటనే మరొక మొబైల్ కొన్నాడు. అది కూడ ఖరీదైనదే. ఇంకా కొత్తమోడల్. ఈసారి మరెవ్వరూ దొంగిలించకుండా జాగ్రత్త పడడం ప్రారంభించాడు.

‘డాడీ అర్జెంటుగా నోట్ బుక్స్ కొనాలి. మార్కెట్ కి వెల్దాము. త్వరగా రెడీ అవ్వండి’ బాబూరావు ఆఫీసు నుండి ఇంట్లో అడుగుపెట్టగానే చెప్పాడు కిరణ్. వాడిప్పుడు టెంత్ చదువుతున్నాడు. ఏ విషయమైనా తొందరగా గ్రహించేస్తాడు. కొడుకు బాగా చదువుతాడని వాడికి కావాలసినదాన్ని ఆలస్యం చేయకుండా అందిస్తాడు బాబూరావు.

తొందరగా బాత్రూము కెళ్ళొచ్చి రెడీ అయ్యాడు బాబూరావు. బైక్ వెనకాల కిరణ్ ని కూర్చోబెట్టుకుని బండి స్టార్ట్ చేసాడు బాబూరావు. అక్కడి నుండి మర్కెట్ నాలుగు కిలోమీటర్ల దూరం. తిరిగి ఇంటికి వేగం రావాలన్న ఉద్దేశ్యంలో వేగంగా డ్రైవు చేస్తున్నాడు బైకు. మధ్య దారిలో ఉండగా బాబూరావు సెల్ రింగయింది. హెల్మెట్ లేకుండా బాబూరావు డ్రైవింగు చెయ్యడు. హెల్మెట్ తీసి దారిలో మాట్లాడడం ఎందుకనుకున్నాడు బాబూరావు. జేబులోని మొబైలుని కుడిచేత్తో తీసి కిరణ్ చేతిలో పెట్టేసి ‘కాల్ ఆన్సర్ చేసి డ్రైవింగులో ఉన్నానని చెప్పు. ఫోను నీ జేబులో ఉంచు. బండి దిగాక మాట్లాడతానులే’ అన్నాడు బాబూరావు. బాబూరావు చెప్పినట్టే సెల్లుని షర్టు మీద జేబులో పెట్టాడు.

వీళ్ళు మాట్లాడే దృష్టిలో ఉండగా ఎదురుగా రోడ్డు మీద స్పీడ్ బ్రేకరు వచ్చింది. ఆటోమేటిగ్గా బ్రేకుపై కాలేసి నొక్కాడు బాబూరావు. సడన్ బ్రేకు పడింది. అయినా స్లో కాకుండా స్పీడ్ బ్రేకర్ మీదకి ఎక్కి ముందుకి కదిలింది బండి. దాంతో పెద్దకుదుపు కుదిపింది. ఆ కుదుపుకి వెనకున్న కిరణ్ ముందుకొచ్చి బాబూరావు వీపుకి గట్టిగా గుద్దుకున్నాడు. అప్పుడు కిరణ్ షర్టు మీద జేబులోని సెల్ ఎగిరి రోడ్ మీద పడింది. పడిన ప్లేసులో నుండి రోడ్డుని మీద రాపిడి చేసుకుంటు చాలా దూరం జరిగింది.

‘డాడీ మొబైల్ కింద పడింది’ గట్టిగా అరిచాడు కిరణ్.

బైకు పూర్తిగా స్లోచేసి రోడ్డు ప్రక్కన ఆపాడు బాబూరావు. బండి దిగి వెళ్ళి సెల్ల్ తెచ్చాడు కిరణ్. ఇంకా అదృష్టమేమంటే మరే వాహనం దాన్ని తొక్కుకుంటూ వెళ్ళలేదు. అయితే మొబైలు నిండా ధూళి, ఇసుక అంటుకున్నాయి. చేతిలోకి తీసుకుని జాగ్రత్తగా కర్చీఫ్ తో శుభ్రం చేశాడు బాబూరావు. స్క్రీన్ అద్దం పగిలింది. చాలా స్క్రాచెస్ పడ్డాయి.

ఓరకంటితో డాడీ చేతిలోని మొబైల్ చూసిన కిరణ్ గుండె వేగం పెరిగింది. డిసిప్లెయిన్ కి ప్రతిరూపం బాబూరావని బాగా తెలుసు వాడికి. మంచిగా ఉన్నప్పుడు ఎంత ప్రేమ చూపుతాడో కోపమొచ్చిన పని చేస్తే మటుకు తాటతీస్తాడు. అందుకే సింహాన్ని చూసిన లేడిపిల్లలా వణికిపోయాడు. బండి ముందర రాడ్ లాగి దాంతో కొట్టి చంపేసి పెద్దగొయ్యి తీసి కప్పేస్తాడేమో అన్నంత భయపడ్డాడు కిరణ్.

'సారీ డాడి. నా వల్లే జరిగింది.' అన్నాడు కళ్ళ నీరు కక్కుకుంటూ కిరణ్. కిరణ్ ఊహించినట్టు ఏమీ జరగలేదక్కడ. కిరణుని ఏమీ అన్లేదు. అసలు కోపమే చూపించలేదు. 'ఫర్వాలేదు. వెళ్దాము పద' సింపుల్ గా చెప్పి బైకు స్టార్ట్ చేసాడు బాబూరావు.

'డాడీ! మీ వస్తువులు ముట్టుకుంటేనే ఒప్పుకోరు. అలాంటిది మీ మొబైల్ పాడు చేసినందుకు కోపం రాలేదా?' అడిగాడు కిరణ్. ఆ టైములో అంత ధైర్యం ఎలా వచ్చిందో కిరణ్ కి అర్థం కాలేదు. బహుశా తండ్రి శాంతం చూసి కాబోలు.

'ఎందుకు రాలేదూ. చాలా కోపం వచ్చింది." చెప్పాడు బాబూరావు కూల్ గానే.

'మరంత శాంతంగా ఉన్నారేం?" మళ్ళీ అడిగాడు కిరణ్.

"ఇప్పుడు కాదు నాన్నా. గతసారి మొబైల్ నా దగ్గర పోయినప్పుడు" చెప్పాడు బాబూరావు.

"ఎవరి మీద. దొంగ మీదా?" మళ్ళీ అడిగాడు కిరణ్.

"నామీదే!" చెప్పాడు బాబూరావు.

'మీమీద మీకు కోపమా? మీరేం తప్పు చేసారు డాడీ ? ప్రాణం లేని వస్తువులని కూడ బాగా చూసుకుంటారు. మమ్మల్ని ఇంకా బాగా చూసుకుంటారు' అమాయకంగా అడిగాడు కిరణ్.

'మొదటిసారి కాస్ట్లీ మొబైల్ కొన్నానని అతిజాగ్రత్తకి పోయి సరదాకి కూడ మిమ్మల్ని ముట్టుకోనివ్వలేదు. దాన్నెవడో

కొట్టేసాడు. మీకివ్వకుండా వాడిన మొబైలుని జేబుదొంగ కొట్టెయ్యకుండా అడ్డుకోలేక పోయాను. వస్తువులపై మోజు పెంచుకోకూడదని అప్పుడే తెలిసింది. అప్పుడు మాత్రం నా మీద నాకే కోపం వచ్చింది. మనుషుల ప్రాణాలకే విలువ లేని రోజుల్లో వస్తువు మీద అతిప్రేమ మంచిది కాదని తెలుసుకున్నాను. అందుకే దీని స్క్రీను పగిలినా, గీతలు పడినా కోపం రాలేదు" బాబూరావు చెప్పాడు.

క్రిష్ణుడి గీతోపదేశంతో అర్జునుడికి జ్ఞానోదయమైనట్లు దొంగగారి చాకచక్య దొంగతనం వల్ల బాబూరావుకి జ్ఞానోదయం అయిందని కిరణ్ అనుకున్నాడు. ఇంటికి వెళ్ళి మమ్మీకి చెప్పాడు గొప్పగా. బాబూరావులో మార్పుకి ఇల్లంతా హ్యాపీసే హ్యాపీస్. ఇక ముందన్నీ హ్యాపీడేస్ వాళ్ళకి.




"యా హూ..." దిక్కులు పిక్కటిల్లేలా అరిచాడు ఇంటర్నెట్ లో మ్యాట్రిమోనియల్ వెబ్ సైట్ చూస్తున్న జోగినాథం. కొడుకు పెట్టిన గావుకేక విని ఏం పుట్టి మునిగిందోనని పరిగెత్తుకుచ్చింది అతడి తల్లి ఆదిలక్ష్మి.

"కనుగొంటిని... నా దేవిని..." అంటూ ధీర్ఘాలు తీసి మరి రాగాలాపన చేస్తూ బొంగరం లా గిరగిరాలు తిరిగాడు జోగినాథం.

కొడుకు చేస్తున్న ఆనంద తాండవానికి అర్ధం తెలియని ఆ అమాయకపు మాతృమూతి "నాన్నా... జోగి... ఎందుకలా అరిచావురా... ఏమైంది?" అడిగింది ఆప్యాయంగా.

నా నిరీక్షణ ఫలించింది. నాకు నచ్చిన అమ్మాయే నీకు కోడలిగా రాబోతోందమ్మా... కలనిజమాయెరా.. కోరిక తీరెగా.... " అంటూ తల్లి చేతులందుకుని హుషారుగా నృత్యం చేయనారంభించాడు.

ఆమె ఆనంద పరవశురాలైంది. "స్వామి... వెంకటరమణా ... ఇన్నాళ్ళకి నా మొర ఆలకించి కరుణించావా తండ్రీ... మా వాడికి పెళ్ళవగానే వచ్చి నీ కొండకొచ్చి తల నీలాలు సమర్పించుకుంటాడు స్వామీ..."

భక్తి తీవ్రత ముప్పిరిగొనగ మొక్కుకుంది ఆదిలక్ష్మి.

జోగినాథం తల్లి వైపు గుర్రుగా చూస్తూ 'నువ్వు తొందరపడి అలాంటి మొక్కులేవి మొక్కుకోకు... పెళ్ళవగానే గుండు కొట్టించుకుంటే హనీమూన్ అంతా బోడిగుండుతో గడపాలి. ... కావలిస్తే... ఆ గుండేదో నాన్న చేయించుకుంటాడులే... ఆయనకెటూ బట్టతలేగా!" అన్నాడు గింగిరాలు తిరిగిన తన ఉంగరాల జుట్టును స్టైల్ గా తడుముకుంటూ..

జో...నా.. తండ్రి వెర్రి వెర్రి చూపులు చూసాడు కొడుకువైపు.

ముచ్చటగా మూడుపదుల వయసు జోగినాథానికి ఇంకా పెళ్ళి కాలేదు.అతగాడు ఆరడుగుల అందగాడు. వేలకు వేలు సంపాదన వచ్చిపడుతున్న సాఫ్ట్ వేర్ ఉద్యోగం లో వున్న వాడు. ఆకర్షణీయమైన నామధేయం లేకపోయినా, ఆకట్టుకునే రూపం కలిగిన మగధీరుడు.

ఇన్ని మంచి లక్షణాలున్న సదరు జోగినాథం ఇంకా బ్యాచలర్ గా మిగిలిపోవడమేమిటీ? అన్న సందేహం ఎవరికైనా కలుగక మానదు.

ఇప్పటికి జోగినాథం నూటిరవయ్యారు సంబంధాలు చూసారు. ఆడపిల్లల కలల రాకుమారిడికీ వుండవలిసిన అర్హతలన్నీ కలిగిన అతగాడికి ఇన్ని సంబధాలు తప్పిపోవడానికి కారణం.. అతడు అమ్మాయిల అందచందాలకి వంకలు పెట్టడమే! లేకపోతే

అత్యాశకు పోయి... తనకున్న మార్కెట్ రేటు దృష్ట్యా లక్షలు లక్షల కట్నం డిమాండ్ చేయడమే కాదు. జోగినాథం ఆడపిల్లల అవయవ సౌందర్యాన్ని వేలెత్తి చూపించి, వారి సొమ్ము కోసం కక్కుర్తి పడే కుసంస్కారి కానే కాదు. అయినా సరే... "శత పెళ్ళిచూపుల దినోత్సవం" దిగ్విజయం గా జరుపుకోవడానికి వెనుక ఓ వింత కారణం వుంది. పెళ్ళి చూపులకి వెళ్ళినప్పుడు అమ్మాయితో ఏకాంతం గా మాట్లాడినప్పుడు ఒకే ఒక వింత షరతుని విధించేవాడు జోగినాథం. తమకి పెళ్ళయిన తరువాత... ఆమె తరపు బంధువు గానీ, తన తరుపు బంధువులు గాని పొరబాటున కూడా తనింటికి రావడానికి వీళ్ళేదని కండిషన్ పెట్టాడు.

చిత్రాతి చిత్రమైనఈ షరతుని విన్న ప్రతీ కన్యామణి ఇతనికి చిత్తచాంచల్యం లాంటి అవలక్షణం ఏదైనా వుందేమోనని భ్రమించి, మరొక ఆలోచన లేకుండా అతడు తనకొద్దని ముఖాన తేల్చి చెప్పేసేది.

ఏ లలనా రత్నమైనా షరతుకి అంగీకరించి తనను పెళ్ళిచేసుకుంటుందేమోనని ఆశగా ఎదురుచూసేవాడు జోగినాథం.

కానీ, బంధుమిత్రులను బద్ధ విరోధుల్లా భావించే జోగినాథంలాంటి బడుద్దాయిని చూస్తూ చూస్తూ ఏ అమ్మాయి పెళ్ళిచేసుకుంటుంది చెప్పండి!.

అసలు... జోగినాథం ఈ వింత షరతుని విధించడం వెనుక ఓ వింత కారణం వుంది. జోగినాథం తండ్రి ఎక్కువమంది బందు బలగాన్ని కలిగి వుండేవాడు, తల్లి కూడా డిట్టో డిట్టో... వచ్చిపోయే బంధు జన సందోహంతో ఇల్లు నిరంతరం పెళ్ళివారిళ్ళులా కిటకిటలాడేది.

ఆదిలక్ష్మి నిత్యం వంట పొయ్యికే అంకితమైపోయి జీవితానికి సార్ధకత ఇంటికొచ్చిన చుట్టాలకు యధాశక్తి మర్యాదలు చేసి, వాళ్ళ మన్ననలు పొందడంలో తప్ప మరి దేనిలోనూ లేదని మెంటల్ గా ఫిక్స్ అయిపోయింది.

ఎప్పుడూ జిడ్డోడుతూ, మాసినబట్టలు కట్టుకుని వంటినిండా మసి మరకలతో కనిపించే భార్యను"కాస్త శుభ్రంగా తయరయ్యి మంచి బట్టలు వేసుకుంటే నీ సొమ్మేం పోయింది?" అంటూ కసురుకునేవాడు జోనా తండ్రి.

కాని, అప్సరసలా తయారయ్యి తనని అలరించేందుకు, ఆమెకు కనీసం రోజు మొత్తం మీద అరగంట సమయమైనా మిగలడం లేదన్న సత్యాన్ని అతడు గుర్తించేవాడు కాదు.

పసివాడైన జోగినాథం మనసులో ఈ సంఘటన చెరగని ముద్ర వేసింది. తన తల్లి యొక్క ఈ దీన స్థితికి కారణం తన ఇంటికి తండోపతండాలుగా వచ్చి వాలే చుట్టాలేనన్న వాస్తవం బోధపడ్డాక అతడికి బంధువులంటే రోత మొదలైంది.

చుట్టల తాకిడి లేకపోతే, తన తల్లి కూడా అడ్వటైజ్ మెంట్స్ లో " మమ్మీ" లా నీట్ గా తయారయ్యి తన ఆలనా పాలనా చూసుకునేది కదా! అన్న భావం ఒకటి అతడి మదిలో అంకురించింది.

పెరిగి పెద్దయి, ఉద్యోగస్తుడయిన తరువాత అతడు ఒక నిర్ధారణకు వచ్చాడు. తాను పెళ్ళంటూ చేసుకుంటే ఎవరూ లేని అనాధ పిల్లని గాని లేకపోతే బంధువులెవర్నీ కూడా దరిచేరనివ్వని పరమ గయ్యాళిని కాని చేసుకోవాలని గట్టిగా తీర్మానించుకున్నాడు.

ఇటువంటి పిచ్చి షరతులు విధిస్తే ఈ జన్మకి పెళ్ళి కాదని, అందరికీ తనలాగానే జరగాలని లేదని నచ్చజెప్పి అతడి మొండి పట్టుదలను రూపుమాపే ప్రయత్నం చేసింది ఆదిలక్ష్మి.

అయినా సరే... జోగినాథం నిర్ణయం లో నో చేంజ్. తాపట్టిన కుందేలుకు మూడే కాళ్ళన్న చందాన బిగుసుకు కూర్చున్నాడు.

"మీ నుదుటన కళ్యాణ గీత లేదు కాబోలు... ఏం చేస్తాం? అంతా నీ ఖర్మ!" నుదురు బొప్పికట్టేలా బాదుకుంది ఆదిలక్ష్మి.

ఇక ప్రస్తుతానికొస్తే...

జోగినాథాన్ని అంతగా ఆకట్టుకున్న ఆ పెళ్ళిసంబంధం తాలూకు వివరాలిలా వున్నాయి.

తమ ఏకైక కుమార్తె, అందాల భరిణె అయినా జీవనకు వరుడు కావాలని, అతడు చుట్టపక్కాలను చుట్టు పక్కలకికి కూడా చేరనివ్వని చండశాసనుడై వుండాలని, తమ పిల్లను చేబట్టబోయే వరుడికి అన్నీ ముద్దు ముచ్చట్లని తాము జరిపించగలమని ప్రకటన ఇచ్చారు పిల్ల తల్లి తండ్రులు.

వెదకబోయిన తీగ కాలిని తగిలినట్లుగా ఎగిరి గంతేసాడు జోగినాథం. ఒకానొక శుభముహూర్తాన మాతాపితరులతో కలిసి

పెళ్ళిచూపులకి వెళ్ళాడు. ఒకరి షరతులు, నిబంధనలు ఇంకొకరికి అమితంగా నచ్చేయడం తో "శుభస్యశీఘ్రం" అనుకుని ఇరు వర్గాల వారు పెళ్ళికి బంధువులనెవరిని ఆహ్వానించడానికి వీల్లేదని జోగినాధం మంకు పట్టు పట్టాడు. కానీ తండ్రి ఆ పప్పులేం వుడకనివ్వేదు. ఒక్కగానొక్క కొడుకు పెళ్ళి "తూ.." మంత్రంగా చేస్తే అందరూ తనని పీనాసివాడని దుయ్యబడతారని చెప్పి జోగినాథం నోరు మూయించాడు. కావాలిస్తే పెళ్ళయిన తక్షణం వేరింటి కాపురం పెట్టేసుకుని, ఒంటికాయ సొంటికొమ్ములా గడపండని పర్మిషన్ కూడా ఇచ్చేసాడు.

తండ్రి మాటలు విని పరమానందభరితుడైన జోగినాధం. తను,తన అర్ధాంగి జీవన బంధు రహిత జీవనం సాగించబోతున్నాం అని తెలిశాక అతడి సంతోషానికి హద్దులే లేకుండా పోయాయి.

మరొక ఇరవై రోజుల తరువాత జీవన, జోగినాధం సహధర్మ చారిణిగా అతడి జీవితంలోకి, ఆ తరువాత అతడి టూ బెడ్రూం ఇండివిజ్వల్ హౌజ్ లోకి అడుగుపెట్టింది.

"తేనే చంద్రుని" దర్శనం అయ్యాక హాయిగా జీవించసాగారు దంపతులిద్దరు.

"తాము త్వరలో భాగ్య నగర సందర్శనార్ధం విచ్చేయనున్నామని, అక్కడ వున్న మూడు రోజులు వీరింట్లోనే మకాం వేయబోతున్నమని" ఫోన్ చేసి చెప్పాడు జీవన పిన తండ్రి చిదంబరం ఓనాడు ఉదయాన్నే.

అంతే... ముచ్చెమటలు కమ్మి మిడిగుడ్లు పడ్డాయి జోగినాధానికి. "ఇదేమిటీ? మీ చిన్నాన్న ఇలా ఫోన్ చేసాడు! అసలు నేను పెట్టిన కండిషన్ మీ వాళ్ళకు ఎవరికి తెలియదా! ఆ మాటకొస్తే మీ అమ్మగారి అభీష్టం కూడా అదే కదా! వీళ్ళిలా దిగబడుతున్నారు!" పెద్ద గొంతేసుకుని భార్య మీద గయ్యిమన్నాడు.

"అది... అది... బాబాయ్ కుటుంబం లో నాకు అనుబంధం కాస్త ఎక్కువ. ఆ చనువు కొద్ది నన్ను చూడాలని..." బిక్కచచ్చిపోయి బితుగ్గా బదులిచ్చింది.

చుట్టాలెవరైనా సరే.. ఇంటి దరిదాపులకొస్తే "సూర్యకాంతం' లెవల్లో పెద్ద గొంతేసుకుని వాళ్ళ మీద విరుచుకుపడేదని మీ అమ్మ గారికి మా చెడ్డ పేరుంది కదా! మరి మీకు మీ చిన్నాన్న కుటుంబం లో అటాచ్ మెంట్ ఎలా ఏర్పడింది!" ఉబికి వస్తున్న ఆగ్రహాన్ని అదుపులో పెట్టుకునే ప్రయత్నం చేసాడు జోగినాదం.

""మా ఇళ్ళకి ఎవరిని ఆవిడ రానిచ్చేది కాదు కాని అప్పుడప్పుడు మేం మాత్రం మా బాబాయ్ ఇంటికి వెళ్ళేవాళ్ళం. ఇంచుమించు నా బాల్యమంతా మా బాబాయ్ గారి దగ్గరే నడిచింది." చావు కబురు చల్లగా చెప్పింది జీవన.

ఖంగు తినడం జోగినాదం వంతయ్యింది. బంధువులను గుమ్మం తొక్కనివ్వని రాకాసి తల్లి పెంపకంలో పెరిగిన జీవన అంతకన్నా రాటుతేలి పోయి, చుట్టాలకు సిం హ స్వప్నమై నిలుస్తుందని ఆశించిన జోగినాధం కలలు కల్లలైనాయి.

పోనీ... కొత్త పెళ్ళానికి ఆనందం కలుగజేసే విధంగా ఈ సారికి ఊరుకుని, ఊరి నుండి రాబోతున్న వారికి ఆతిధ్యం ఇస్తే ఎలా వుంటుంది! ఈ ఆలోచనకే జోగినాధం గుండె గుబిల్లుమంది.

అమ్మో! ఈ చుట్టాలున్నారే! వేలు చూపిస్తే మండ మింగే రకాలు. కాస్త సందిస్తే... తామర తంపరలల్లే అల్లుకుని, పీల్చి పిప్పి చేసి తన కొంప గుండం చేయరూ! తల్లి లాగే జీవన కూడా... చాకిరీ చేస్తూ.. ధేభ్యం ముఖం వేసుకుని... ఠాట్... అలా జరగడానికి వీల్లేదు. తన ప్రాణం పోయినా సరే బంధువులెవ్వరినీ ఇంట కాలు పెట్టనివ్వడు.

"అప్పుడు నీకు వాళ్ళతో అనుబంధముంటే ఉండుగాక! ఇప్పుడు మాత్రం ఎవ్వరూ నా గడప తొక్కేందుకు వీల్లేదంతే! హుంకరించాడు జోగినాధం లేని బింకం తెచ్చుకుని.

"అంతేనా ఈ ఒక్కసారికీ" అర్ధాంగి అరమోడ్పు కళ్ళతో అలా అర్ధింపుగా చూసేసరికి జోగినాధం గుండె తన నెలవు తప్పింది ఒక్క క్షణం.

మనో నిగ్రహం కలిగినవాడు కనుక ఆ చూపుల గారడీలో చిక్కుకు పోకుండా "నథింగ్ డూయింగ్" .. ఒక్క సారీ లేదు... అర సారీ లేదు..." అన్నాడు ఆమె కళ్ళల్లోకి చూడకుండా జాగ్రత్తపడుతూ,

"లాభం లేదు ఎంతగా బతిమిలాడిన ఓ మెట్టు కూడా దిగిరాడీ మొండి మొగుడు. "మనసులోనే కసిగా తిట్టుకుని " సరే.. మీ ఇష్టం" అంది జీవన ముఖం చిన్నబుచ్చుకుని.

అయితే మనం ఊళ్ళో వుండడం లేదని వాళ్ళకి ఫోన్ చేసి చెప్పె ." హుషారుగా అన్నాడు జోగినాధం.

'అలా చెప్తే మనం ఊరి నుండి తిరిగొచ్చాక వస్తామంటారు" నిర్లిప్తంగా అంది జీవన.

అయితే తరుణోపాయం తానే ఆలోచించాలి. అనుకున్నాడే కానీ వాళ్ళ రాకను ఎలా నిరోధించాలో జోగినాధం కంప్యూటర్ బుర్రకి తోచలేదు. "మట్టాలున్నారు", భంధువులొస్తున్నారు" తదితర తెలుగు చిత్ర రాజాల సి.డి. లు తెచ్చుకుని రాత్రి పగలు కళ్ళు కన్నాలు పడేలా చూసినా నో యూజ్...

ఈ ఉపద్రవాన్ని ఎలా అడ్డుకోవాలో ఆలోచించి..చించి అతడి కళ్ళు లోతుకుపోయాయి. పట్టుకుచ్చులాంటి వెంట్రుకలు కుచ్చుచ్చులుగా ఊడి చేతులోకొస్తున్నాయి. జుట్టు పీక్కున్నప్పుడల్లా, అప్పటికే పేను కొరికినట్లుగా తయారైన తన అందమైన తలకట్టు ఇంకా పీక్కుంటే రాగి చెంబయిపోయే ప్రమాదముందని ఆ పని మానేసి ఆలోచించడం కొనసాగించాడు.

అలా.. మరి రెండు రోజులు నిద్రాహారాలు మాని మెదడుకి పదును పెట్టగా ఓ మహత్తరమైన ఆలోచన తట్టింది. జోగినాధానికి, దాన్ని యధాతథం గా అమలు పెట్టాలని ముందుకురికాడు జోగినాధం.

అన్నీ సర్దావా! త్వరగా రా.. మళ్ళీ మీ వాళ్ళొచ్చేయగలరు. .." అన్నాడు జొగినాధం హడావుడి పడుతూ. "ఆ.. ఆ.. అయిపోవచ్చింది.." ముచ్చటగా ముప్పై ఒకటవసారి చీర కుచ్చిళ్ళను సవరించుకుంది జీవన. నాలుగైదు రోజుల యోచనా ఫలితంగా ఉద్భవించిన ఐడియా ప్రకారం ఆ బంధువులొచ్చేసరికి తాము ఇంటి పట్టున లేకుండా, భార్యా సమేతం గా బయటకు వెళ్ళి రెండు రోజులపాటు కులాసాగా తిరిగి రావాలని నిశ్చయించుకున్నాడు జోగినాధం.

వచ్చిన వాళ్ళు, ఇల్లు తాళం పెట్టి ఉండడం గమనించి తమకి ఫోన్ చేసినా సరే.. అనుకోకుండా ఏదో కంపనీ టూర్ తగిలి అర్జెంటుగా వెళ్ళాల్సి వచ్చిందని, జీవనని కూడా తనతో పాటు తీసుకెళ్ళల్సి వచ్చిందని బుకాయిస్తే సరిపోతుంది. అప్పుడు వాళ్ళేమీ చేయలేక ఏ హోటల్లోనో ఉండి ఊరు చుట్టేసి వెళ్ళిపోతారని జోగినాధం అంచనా..

అన్ని రకాలుగా ఆలోచించిన మీదట ఈ ప్లానయితే వర్కవుట్ అవుతుందనిపిచింది.

"నువ్వెళ్ళి బైక్ దగ్గరుండు. నేను ఇంటికి తాళం వేసి వస్తాను. జీవనను బయటకు తరిమి తలుపు గట్టిగా పెట్టి కొత్తగా

కొనుక్కొచ్చిన గోడ్రేజ్ కంపనీ వారి  అతి పెద్ద తాళం కప్పను బిగించి వేసాడు జోగినాధం. తాళం సరిగ్గా పండిందో లేదోనని

ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకుని , కూని రాగాలు తీస్తూ బయటకొచ్చాడు.వున్నట్టుండి మనోవల్లభుడిని చెవులు చిల్లులు పడేలా కెవ్వుమని అరిపించింది.జీవన.

గుండెలవిసిపోయిన జోగినాధం ఛూ…ఛూ… అని వీపు చరచుకుని ఎందుకలా అరిచావు. అని అడిగాడు. ఆగ్రహంగా…

"మరి .. నా హ్యాండ్ బ్యాగ్ లోపలే మరిచిపోయాను. ముద్దులు గునిసింది జీవన. ఆ కులుకులకి కుదేలైపోయాడు జోగినాధం. తాళం చెవి ఆమె చేతికి అందిస్తూ "త్వరగా వెళ్ళి తెచ్చుకో … ఆ తాళం మాత్రం సరీగా వేయడం మరచిపోకు. అసలే దొంగల బెడద ఎక్కువగా వుంది." అన్నాడు ఆమెను హెచ్చరిస్తూ. జీవన మత్తుగా నవ్వి  "క్షణం లో వచ్చేయనూ..!"  అంది. అన్నట్లుగానే క్షణం లో తిరిగివచ్చి కీస్ భర్త చేతికి అందించింది.

"సరిగ్గా లాక్ చేసావా!" బైక్  స్టార్ట్ చేస్తూ అడిగాడు జోగినాధం.

"నా మీద మీకంత నమ్మకం లేకపోతే వెళ్ళి వేరిఫై చేసుకు రండి ." మూతి బిగించి రుసరుసలాడింది జీవన. మరి లోపలికి వెళ్ళి చూసొచ్చే ఓపిక లేక బైక్ మీద నుండి ముందుకు వంగి, దూరానికి కనిపిస్తున్న తన ఇంటి తలుపుకి వేళ్ళాడుతున్న తాళం కప్పను, తృప్తిగా నిట్టూర్చి బైకె ముందుకురికించాడు జోగినాధం.

వాళ్ళిద్దరూ. హైద్రాబాద్ ఝూం ఝూం ఝూం అంటూ విహరించారు ఇంటికొచ్చేసరికి  అవాక్కయి నిలబడి పోయిన జోగినాధాన్ని చూసి

"ఏవిటల్లుడుగారూ! అలా షాక్ కొట్టినట్లుగా  నిలబడిపోయారు". చనువుగా పలకరించాడు చిదంబరం.

"అంతా మనలని చూసిన ఆనందం అయ్యుంటుంది. .. అంతేనా బాబు…" అంది జగదాంబ ముసిముసిగా నవ్వుతూ. వారికి ఏమని బదిలియ్యాలో తెలియక, వారి రాకను జీర్ణించుకోలేక ఆల్లల్లాడిపోయాడు జోగినాధం. ముఖాన చిరునవ్వు అతికించుకుని ముక్తసరిగా వారిని పలకరించి గదిలో దూరాడు. తరువాత జీవన ఒంటరిగా దొరికినప్పుడు"ఇదెలా జరిగింది" అంటూ ఆమె కర్ణభేరి బద్దలయ్యేలా గొంతు చించుకున్నాడు.

జీవనకు ఏపని తగలనివ్వకుండా అన్నీ తానే చేసుకుపోయింది జగదాంబ. రకరకాల వంటకాలు చేసి జోగినాధానికి కడుపు నిండా భోజనం పెట్టింది.      చిదంబరం సంగతి సరేసరి...

జోగినాధం తన షరతు సంగతి తాత్కాలికంగా మరిచి వారితో ఎంజాయ్ చేసాడు.వెళ్ళే ముందు వాళ్ళ కుటుంబానికి బట్టలు పెట్టారు జోగినాధం. వాళ్ళకి నచ్చిన వస్తువు కొనుక్కోమని ఐదు వేల రూపాయలు చేతిలోపెట్టారు.      తాళం వున్న ఇంట్లోకి వాళ్ళెలా ప్రవేశించారో అర్ధమవట్లేదు.

ఈ విషయంలో వాస్తవం అతడికి ఎట్టి పరిస్థితుల్లో తెలిసే చాన్స్ లేదు.      ఆ రోజు హ్యాండ్ బ్యాగ్ మరిచిపోయానన్న నెపంతో లోపలికి వెళ్ళిన జీవన తలుపు గడియపైన తాళం వేయకుండా, కిందున్న గొనిదకి తాళం కప్ప దిగించి ఆ పైన గడియ మామూలుగా వేసేసి వచ్చేసి తాళం చెవులు భర్త చేతికిచ్చేసింది.

గడియ కింద వేసి వున్న తాళం కప్పను చూసి గడియపైని భ్రమించాడు జోగినాధం.

అంతకు మునుపే పొరిగింటి పిన్నిగారికి, సంగతి వివరించి తన వాళ్ళను ఇంట్లోకి చేర్చే పూచీ ఆమెకు అప్పగించింది. జీవన సాగించిన ఈ మంత్రాంగం అస్సలు తెలియని అమాయక జోగినాధం " మూసి వున్న ఇంట్లోకి బంధువులెలా చొరబడ్డారో " అని ఆలోచిస్తూ బుర్ర బద్దలుకొట్టుకుంటూనే వున్నాడు.




ఇహ నావల్ల కాదురా మల్లేశం! తిరిగివెళదాంపద." ముఖానికి పట్టిన చెమటని తుడుచుకుంటూ అన్నాడు నాగేశ్వర శాస్త్రి. "నీతో ఇదేరావచ్చిన చిక్కు.దేనికీ ఓపికుండదు, అసలు నిన్నెవరురమ్మన్నార్రా! నాతో, నాతిప్పలేవో నేనుపడేవాడ్నిగా?" కోపంగా అన్నాడు. మల్లేశ్వర శాస్త్రి ఇద్దరూ యజ్ఞోపవీతాలతో అపర అగ్నిసంభవుల్లా ఉన్నారు. "ముందా చీటీతీసి సరిగా ఇంటినెంబర్ మరోమారు చూడు. 1-6-9 లేక 6-9-1 ఈరెండింటిలో అసలు నెంబరేదో తెలీకపోయె! ఇప్పటివరకూ 1-6-9 అని వెతికాం,అదికాదని తెల్సిందాయె!ఇహ 6-9-1 నెంబరు ఇంటికోసం వెతకాలా?.

నీవసలు వ్రాసుకోడం సరిగాఉండుంటే ఇంత గొడవ ఉండేదేకాదు. నీ ఆరూ,తొమ్మిదీ ఒకేలా ఉండేడుస్తాయాయె! ఈరెండింటిలో అసలు నెంబరేదో తెలీక రెండుగంటలనుంచి ఈ ఎండలో వెతుక్కుంటున్నాం,కనీసం ఆ ఇంటి వాళ్ళ టెలిఫోన్ నెంబరైనా రాసుకున్నావుకాదు." అంటూ నాగేశ్వర శాస్త్రి వీధిమధ్యలో నిల్చుని ఇటూ అటూ చూడ సాగాడు.

ఇంతలో వచ్చేశారా? రండి రండి ! మీకోసమే గంటనుంచి ఎదురుచూస్తున్నాం.పాపం ఇల్లుకనుక్కోడం ఇబ్బందైనట్లుంది కదా! రండి ఈవైపు మా ఇల్లు." అంటూ దారి చూపసాగాడో వ్యక్తి . వయస్సు యాభై ఉండవచ్చు.పంచ కట్టుకుని పైనఉత్తరీయంమాత్రమే వేసుకుని ఉన్నాడు. ఆయన వెనకాలే అయోమయంగా, ముఖ ముఖాలూ చూసుకుంటూ నడవసాగారు ఇద్దరూనూ. "రండి! మానాయన గారు ఆలస్యానికి తాళలేరు.స్నానాలు చేసే వచ్చారుగా? ఇలా వెళ్ళి ఈ బాత్ రూంలో కాళ్ళదీ కడుక్కు రండి. ఇవిగోండి తువ్వాలాలు." అంటూ హడావిడిచేయసాగారాయన . ఏదో చెప్పబోతున్న మల్లేశ్వర శాస్త్రి తో, " అన్నీ తర్వాతే ముందు కార్య క్రమం కానీండి" అంటూ తోసినట్లే బాత్ రూంవైపు నడిపించాడు . వారు కాళ్ళూ ముఖాలుకడుక్కుని వచ్చేవేళకు " ఇవోండి మడి ఉత్తరీయాలు ,పంచలూనూ. వెంటనే ధరించిరండి. " అంటూ హడావిడి చేశాడు.

అయ్యా! మీరసలు...మమ్మల్ని .." ఏదో చెప్పబోతున్న నాగేశ్వరశాస్త్రిని చేయెత్తి ఆపి., ." అయ్యలారా! మానాయనగారు 70ఏళ్ళ ముదుసలి. ఆయన ఆట్టే సేపుండలేరు. దయచేసి ముందు మడి బట్టలు ధరించి ,ఔపోసన వేయించుకోండి ,అప్పుడే మానాయన గారూ భోజనం చేస్తారు . ఆతర్వతే అన్నీ చెప్పండి . ఈపాటికే చాలా ఆలస్య మైంది." అంటూ తానూ మడిబట్టకట్టుకుని వారిద్దరికీ పంచలూ ఉత్తరీయాలూ అందించాడు.

నాగేశ్వరశాస్త్రి,మెల్లిగా " ఒరే !ఆకలిమీదున్నాం .ఏదైతే కానీ ముందు భోజనం చేసేద్దాం.మనమూ జంధ్యాలున్న బ్రాహ్మణులమేగా ?" అని మెల్లిగా మల్లేశ్వర శాస్త్రి చెవి లో అన్నాడు. సరే అనుకుని ఇద్దరూ , తమబట్టలు మార్చుకుని మడిబట్టలు ధరించి అరిటాకుల ముందు కూర్చుని జంధ్యాలు సవరించుకుని , ఔపోసన వేయించుకున్నారు . ఆపైన మూడుకూరలూ , నాల్గుపచ్చళ్ళూ , పప్పూ, రసం, గారెలూ, అరిసెలూ, కమ్మని నెయ్యి , గడ్డపెరుగుతో కొసరి కొసరీ భయభక్తులతో ఇంటివారు ,వడ్డిస్తుండగా భోజనం కాని చ్చారు. భోజనం పూర్తయ్యాక ,ఇద్దరికీ చెరో ఐదువందలూ, పంచలచాపూ తాంబూలం తో కపిలి ఇచ్చి నమస్కరించారు.

" చాలా సంతోషం బాబూ! సమయానికి వచ్చి ఆదుకున్నారు. ఈరోజునమా తాతగారి ఆబ్దీకం , చాలాఏళ్ళక్రితమే కాశిలో కర్మ క్రతు వులు నిర్వహించారు మా నాయనగారు! . ప్రతిఏడాదీ ఇలా ఇద్దరు బ్రాహ్మణులకు ఔపోసన వెసుకోడం ఆచారం." అంటూ మళ్ళీ నమస్కరించారు. నాగేశ్వరశాస్త్రి , మల్లేశ్వర శాస్త్రి ఇహఅక్కడుంటే పరువు నిలవదనిభావించి బదులునమస్కారంచేసి బయట పడ్డారు. వారు బయటికెళు తుండగా ఇద్దరు బ్రాహ్మణులు ఆదరాబాదరా లోపలికి వచ్చారు. విషయం తెల్సుకుందామన్న కుతూహలంతో నాగేశ్వరశాస్త్రి , మల్లేశ్వర శాస్త్రి గేటువద్ద లోపలి మాటలు వినేందుకై నక్కి నిలిచారు.

"అయ్యా! మన్నించాలి , భయంకరమైన ట్రాఫిక్ లో ఇరుక్కున్నాం ,ఇప్పటికి ఇల్లు కనుక్కుని వచ్చాం " అనిచెప్పగా ,ఆ ఇంటి యజమాని "అయ్యలారా! మీకు వారంక్రితమే చెప్పాం , మానాయనగారు ఆలస్యానికి తాళ లేరని. ఎవరో ఇద్దరు బ్రాహ్మణకుర్రాళ్ళు ఇల్లువెతుక్కుంటుండగా, వారే మీరుగా భావించి వారు చెప్పబోతున్న మాటలు కూడా వినే వ్యవధానం లేక

ఔపోసన వేసి భోజనం పెట్టేశాం. ఐపోయింది. మీరూ కావలిస్తే మాతోపాటు భోంచేసి వెళ్ళండి .బ్రాహ్మణులు అభోజనంగా వెళ్ళ రాదు." అంటూ లోపలికి ఆహ్వానించాడు.

అసలు జరిగిందేమంటే నాగేశ్వరశాస్త్రి , మల్లేశ్వర శాస్త్రి తెల్సిన వారింట జరగబోయే ఒక కార్యక్రమానికై నగరాని కొచ్చారు, వారి గృహం వెతికే వేటలో అలసి సొలసి నీరిచ్చేవారు కూడా కనిపించక నడి మధ్యాహ్నం అంగలార్చుకుపోతుండగా జరిగిన కధ ఇది. ఏమైతేనేం వారి యజ్ఞోప వీతమే వారిని ఆకలి, దాహ బాధల నుండికాపాడింది.




నమ్రత కేన్సర్ హాస్పిటల్. సమయం ఉదయం పది గంటలు. అప్పుడే రౌండ్స్ పూర్తిచేసుకొని తన ఛాంబర్ లో అడుగుపెట్టిన డ్యూటీ డాక్టర్ విశేష్ ఎదురుగా ఉన్న కాలెండర్ చూశాడు. ఇరవయ్యో తారీఖు. ఉలిక్కిపడ్డాడు. అన్యమనస్కంగా ఫ్లాస్క్ లో కాఫీ కప్పు లో వంచుకుని తాగుతూ ఆలోచనలో పడ్డాడు. ఎన్ని సమస్యలో కదా తనకి అనుకుంటూ.

రెసిడెన్షియల్ కాలేజ్ లో చదువుతున్న కొడుక్కి వారం లో ఐఐటి పరీక్ష. ర్యాంక్ రాకపోతే తనకి తలవొంపులు. పైగా వాడు లాంగ్ టర్మ్ కూడా. నాలుగు వందల కిలోమీటర్ల దూరం లో వున్న పట్టణం లో గవర్నమెంట్ ఉద్యోగిని అయిన భార్య ట్రాన్స్ఫర్ కోసం చేయని ప్రయత్నం లేదు. ఏడాది నించి ఆమె అక్కడ వర్కింగ్ విమెన్స్ హాస్టల్ లో ఉంటోంది. నెలకోసారి కలుసుకుంటూ కాలం వెళ్ళబుచ్చుతున్నారు. ఈ సంవత్సరం ఎలాగైనా ఏ ఎమ్మెల్యే కాళ్ళో పట్టుకొని తన ఊరికి బదిలీ చేయించుకోవాలి.

కూతురు ఎమ్మెస్ కోసం త్వరలో యూఎస్ వెళ్లబోతోంది. దానిక్కావాల్సిన బ్యాంక్ లోన్లు,ష్యూరిటీలు రెడీ చేస్కోవాలి. పిల్ల వచ్చేవారం వీసా ఇంటర్వ్యూ కి వెళ్ళాలి. చాలామందిని రిజెక్ట్ చేస్తున్నారట. ఇదెలా చేస్తుందో ఏంటో? వృద్ధాశ్రమం లో ఉన్న డెబ్బై ఏళ్ల తండ్రి కి ఈ మధ్య వొంట్లో కులాసాగా లేదని కబురు తెలిసినా వెళ్లలేదు. ఇంట్లో చూస్తే వంటమనిషి సరిగ్గా రావడం లేదు. అంతా చికాగ్గా ఉంటోంది. బహుశా నాకున్నన్ని సమస్యలు ఇంకెవరికి ఉండవేమో?? అనుకున్నాడు విశేష్ .

నర్స్ హడావిడిగా తలుపు తోసుకుం టూ "డాక్టర్, డాక్టర్!" అంటూ లోపలికి వచ్చేసరికి ఆలోచనల్లోంచి ఒక్కసారి బైట పడ్డాడు విశేష్.

"ఏమైంది ఇప్పుడే కదా అందరినీ చూసి వచ్చాను"

"రూమ్ నంబర్ ఫైవ్ లో ఉన్న పాప ఫ్రెండ్స్ వచ్చారు. తనని చూడ్డానికి. పంపమంటారా సార్?".

"ఎవరు? జ్యోతి ఫ్రెండ్సా? పంపించు. పాపం చిన్నపిల్ల. కాసేపు వాళ్ళతో స్పెండ్ చేస్తే బాధ మర్చిపోతుంది." అనుమతించాడు.

పదకొండేళ్ళ జ్యోతి నెలన్నర నించి కేన్సర్ చికిత్స తీసుకుంటోంది. హాస్పిటల్లో అందరికంటే చిన్న పేషెంట్ తనే. తండ్రి లేడు. తల్లి బ్యాంక్ లో క్లర్క్. కేన్సర్ గుర్తించేసరికి ఆలస్యమైపోయింది. ఛాన్స్ లేనట్టే.. కానీ మానవ ప్రయత్నం మానకూడదు కదా..చికిత్స కొనసాగిస్తున్నారు. తల్లికి చెప్పేశారు, ఆమె మనసులో దుఃఖం పిల్ల ముందు వ్యక్తం చేయకుండా గుండె నిబ్బరం చేసుకుని కూతుర్ని కంటికి రెప్పలా చూసుకుంటోంది.

ఒక్కొక్కసారి కడుపు నెప్పి తీవ్రమై జ్యోతి గట్టిగా కేకలు పెట్టేస్తుంటుంది. ఆలాటప్పుడు సెడేటివ్ ఇచ్చి పడుకోపెట్టేస్తుంటారు. అంతకు మించి ఏమీ చేయలేక. ఇంక కొన్ని వారాలో, రోజులో? రాన్రాను నెప్పి పెరిగిపోయి ఆమె శరీరం మందులకి రెస్పాండ్ కావట్లేదు. ఇప్పుడు రోజుకి మూడు సార్లు సెడేటివ్ ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. " పూర్ గర్ల్" అని నిట్టూర్చాడు విశేష్ ఆమె ని తలచుకొని.

"హాయ్ జ్యోతీ, చూడు నీకోసం ఏం తెచ్చామో? అంటూ పిల్లలు బెలూన్స్, టెడ్డీబేర్ బొమ్మలు, చాక్లెట్స్,బొకేలు ఆమె మంచం దగ్గర పెట్టారు. వాళ్ళని చూసి "హాయ్" అంటూ నీరసంగా నవ్వింది జ్యోతి. కాసేపు వాళ్ళతో మాట్లాడింది.టీచర్ల గురించి, మిగిలిన ఫ్రెండ్స్ గురించి పేరు పేరునా అడిగింది. "త్వరగా వచ్చేయ్ జ్యోతీ, వి ఆల్ మిస్సింగ్ యూ!" అంటూ ఆమె చేతిని ముద్దు పెట్టుకున్నారు ఫ్రెండ్స్. ఒక్కసారిగా కడుపులో పేగులన్నిటిని విరిచేస్తున్నంత నెప్పి. తట్టుకోలేక కన్నీళ్లు పెట్టుకుంది. ఆమెనే గమనిస్తున్న తల్లి వాహిని "అమ్మా జ్యోతీ ఏంట్రా నెప్పి వస్తోందా? ఉండు డాక్టర్ ని పిలుస్తాను." అనేలోపే పిల్లలు వెళ్ళి డాక్టర్ విశేష్ ని పిల్చుకొచ్చారు.

"ఏంటి జ్యోతీ ? నెప్పిగా ఉందా? ఇంజెక్షన్ చేస్తే తగ్గిపోతుంది" అంటూ సెలైన్ డ్రిప్ కి సెడేటివ్ ఇంజెక్ట్ చేయబోయాడు. " ఎందుకు?నెప్పి తగ్గడానికా? లేక నెప్పిని మర్చిపోయి మత్తు గా పడుకోడానికా? నాకు ఇంజెక్షన్ వద్దు అంకుల్.". అని వారిస్తున్న జ్యోతి ని ఆశ్చర్యంగా చూశాడు.

"అవునంకుల్ , వారం నించి చూస్తున్నా. నెప్పి ఎక్కువవ్వగానే ఇంజెక్షన్ ఇస్తున్నారు. దాంతో నేను మత్తు లోకి వెళ్లిపోతున్నా. తెలివి రాగానే కాసేపు బాగుంటోంది. మళ్ళా కాసేపటికి నెప్పి మొదలు. ఈ మధ్య నెప్పి పెరిగి పోవడంతో ఇంజెక్షన్ డోస్ పెంచేశారు. అటు చూడండి మా అమ్మ .. తన గురించి ఆలోచించకుండా నామీదే ప్రాణం పెట్టుకొని, రాత్రనకా, పగలనకా నాకు సేవలు చేస్తోంది. ఇకపోతే వీలు దొరికినపుడల్లా ఏవేవో పట్టుకొచ్చి నన్ను సంతోష పెట్టాలని చూసే నా ఫ్రెండ్స్.

వీళ్లతో గడపడానికి లేకుండా మీరలా మత్తు ఇచ్చేస్తే ఎలా? నాకు తెలుస్తోంది అంకుల్ నేనింక ఎన్నాళ్ళో బతకను ఈ నెప్పితో అని. ఈ కొద్ది రోజులూ మగతలో గడిపేస్తే తర్వాత అమ్మని చూడాలని ఉన్నా చూడలేను కదా!.. ఇంకొన్ని రోజుల్లో ఇంజెక్షన్ అవసరం లేకుండానే నిద్ర లోకి వెళ్లిపోతాను. దయచేసి ఇప్పుడు మాత్రం నాకు మత్తు ఇంజెక్షన్ ఇవ్వకండి ప్లీజ్. నా కళ్లని తెరిచే ఉం డనివ్వండి." వేడుకుంది బాధని పళ్లబిగువున భరిస్తూ. చలించి పోయారంతా ఆమె మాటలకి.

"కాదురా. నువ్వు స్పృహ లో ఉంటే తట్టుకోలేవని డాక్టర్ గారు ఇంజెక్షన్ ఇస్తున్నారు. నా తల్లి కదూ, మాట వినమ్మా!" కళ్ల నీరు ధారాపాతంగా కారిపోతోంటే నచ్చచెప్పబోయింది వాహిని.

“వద్దమ్మా. నాకు నువ్వు చాలా ప్రాణం. చిన్నప్పటి నించి నన్ను ఎంత ప్రేమగా పెంచావో ? అనుక్షణం నా కింద ఎన్ని సేవలు చేస్తున్నావో? ఇప్పుడు కూడా నా పొట్ట రాస్తూ, కాళ్ళు నొక్కుతూ ..నా గురించి తల్లడిల్లుతున్నావు. నేను నీకేమి చేయలేకపోతున్నాను. వచ్చే జన్మంటూ ఉంటే నేను నీకు తల్లిగా పుట్టాలని కోరుకుంటున్నా. కనీసం చనిపోయే లోపు ఎంత వీలయితే అంత సేపు నిన్ను చూస్తూ ఉండాలని ఉందమ్మా. అందుకే ఇంజెక్షన్ వద్దంటున్నా. దయచేసి నన్ను అర్థం చేసుకోండి”.ఏడ్చేస్తోంది జ్యోతి ఆవేదన గా. అందరికీ కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి.

డాక్టర్ విశేష్ కి చెళ్ళున చెంప దెబ్బ తగిలినట్టయింది.. రెండు కారణాలకి. ఒకటి తనకున్న అతి మామూలు సమస్యలని చాలా తీవ్రమైనవిగా భావిస్తున్నందుకు. జ్యోతి సమస్య తో పోలిస్తే తనవి అసలు సమస్యలా?మృత్యువు కంటె పెద్ద భయం, సమస్య ఇంకేం ఉంటుంది? అదీ చిన్న వయసులో ఏమీ అనుభవించకుండానే, తల్లిని ఒంటరిచేసి వెళ్లిపోవల్సి రావడం.. ఆమెకి గర్భ శోకాన్ని మిగల్చడం.

ఇక రెండవది ఆ పిల్లకున్న మానవత్వం,కృతజ్ఞత.. తను ఎంత బాధల్లో ఉన్నా తన వాళ్ళకి ఏదో చేసి సంతోషపెట్టాలన్న తపన. తనేం చేశాడు? పాతికేళ్లు నిర్విరామంగా తన అభ్యున్నతి కోసం పాటుపడి, సమాజం లో మంచి స్థాయి కి తెచ్చిన తన తండ్రిని అమ్మ మరణించిన కొన్నాళ్లకే ఏవో సాకులతో వృద్ధాశ్రమం పాలు చేసాడు. కొన్నాళ్ల పాటు వారానికోసారి ఫోన్ చేస్తూ, రెన్నెల్ల కోసారి చూడ్డానికి వెళ్ళేవాడు. ఇప్పుడు నెలకోసారి ఫోన్ ..అంతే!నాన్నకి తనని, తన భార్యా పిల్లల్ని చూడాలని, తమతో గడపాలనీ ఎంతో ఆశ. కానీ కొడుకుగా తనేం చేస్తున్నాడు? పూర్తిగా లోకం చూడని జ్యోతి డెత్ బెడ్ మీద ఉండి తల్లికి ఎలా కృతజ్ఞత చూపించుకోగలనా అని ఆరాటపడుతోంటే తాను పాతికేళ్లపాటు తండ్రి సేవల్ని, ఆస్తుల్ని యధేచ్ఛగా అనుభవించి అవసరం తీరగానే వృద్ధాశ్రమం లో చేర్పించి చేతులు దులిపేసుకున్నాడు. తన తప్పులు ఎదురు తిరిగి ప్రశ్నిస్తోంటే ఆరిపోతున్న “జ్యోతి” వెలుగుల్లో పశ్చాత్తాపం తో దహించుకు పోతూ తండ్రిని క్షమాపణ కోరుకుని ఇంటికి తీసుకు రావడానికి సన్నద్ధ మయ్యాడు డాక్టర్ విశేష్.